- దామచర్ల, కందుల, గూడూరి పేర్లు సిఫార్సు
- సీఎం చంద్రబాబుదే తుది నిర్ణయమని తీర్మానం
- ఒంగోలుకు యువత, తెలుగు మహిళ పదవులు
- దర్శికి తెలుగు రైతు అధ్యక్ష పదవి, గిద్దలూరుకు లీగల్ విభాగం
- త్రిసభ్య కమిటీ సమావేశంలో నిర్ణయం



మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి వేదికపై మంత్రి స్వామి, ఎరిక్షన్, ఉగ్ర, మేయర్, జనార్ధన్, ముత్తుముల, లక్ష్మి, తేజశ్వని

ఒంగోలు లోక్‌సభ టీడీపీ అధ్యక్షుడిగా కొత్త వారిని నియమించాలని ఆ పార్టీలోని ముఖ్యనాయకులు అభిప్రాయపడ్డారు. తదనుగుణంగా సామాజిక వర్గాల వారీ ముగ్గురి పేర్లను సూచించారు. ఆమేరకు ఆదివారం ఒంగోలులో జరిగిన ప్రత్యేక సమావేశంలో రాష్ట్రం నుంచి వచ్చిన త్రిసభ్య కమిటీకి ఒంగోలు, మార్కాపురం ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, కందుల నారాయణరెడ్డితోపాటు ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు పేర్లను సిఫార్సు చేశారు. అనుబంధ సంఘాల అధ్యక్షుల ఎంపికపై కూడా మంత్రి, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులతో త్రిసభ్య కమిటీ చర్చించింది. మొత్తం 18 కమిటీల్లో కొన్నింటిని ఆయా నియోజకవర్గాలకు కేటాయించారు.

టీడీపీ అధ్యక్షుడి మార్పు ఖాయం

కొత్త నేతను నియమించాలని జిల్లా నాయకుల తీర్మానం

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మంత్రి సంధ్యారాణి ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలు వచ్చిన త్రిసభ్య కమిటీ సభ్యులు లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. మంత్రి స్వామితోపాటు ఎమ్మెల్యేలు దామచర్ల, డాక్టర్ ఉగ్ర, ముత్తుముల, కందుల నారాయణరెడ్డి, నియోజకవర్గాల ఇన్‌చార్జులు గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్షన్‌బాబుతోపాటు ఆహ్వానించిన కింది స్థాయి నాయకులు పాల్గొన్నారు. లోక్‌సభ కమిటీకి అధ్యక్షుడి ఎంపికతోపాటు 18 అనుబంధ సంఘాల అధ్యక్షుల నియామకంపై సమావేశానికి హాజరైన వారి నుంచి అభిప్రాయం సేకరించారు. చివర్లో త్రిసభ్య కమిటీ సభ్యులు ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులతో ప్రత్యేకంగా భేటీ అయి వారి అభిప్రాయాలనూ తెలుసుకున్నారు. తొలుత పార్టీ లోక్‌సభ అధ్యక్ష పదవిపై ఆసక్తి ఉన్న వారు పేర్లు ఇవ్వాలని కోరారు. అందుకు అనుగుణంగా కొందరు తమ పేర్లు పరిశీలించాలని కమిటీకి సూచించారు. వారిలో ఒక ఎమ్మెల్యే కూడా ఉన్నట్లు తెలిసింది. అయితే రాష్ట్రస్థాయిలో ఆయా సామాజికవర్గాల మధ్య సమతూకాన్ని పరిగణనలోకి తీసుకునే క్రమంలో ఒంగోలు లోక్‌సభ అధ్యక్ష పదవి విషయంలో ఎవరికి సీఎం ప్రాధాన్యం ఇస్తారో చెప్పలేమన్న కమిటీ సభ్యులు అందుకని ఇద్దరు, ముగ్గురు పేర్లు సూచించాలని కోరారు.

అధ్యక్ష పదవిని ఆశించడం లేదన్న ఉగ్ర, ముత్తుముల, లక్ష్మి

కనిగిరి, గిద్దలూరు ఎమ్మెల్యేలు ఉగ్ర నరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి, దర్శి టీడీపీ ఇన్‌చార్జి లక్ష్మిలు తాము అధ్యక్ష పదవిని ఆశించడం లేదని స్పష్టం చేశారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అధిష్టానం నిర్ణయమే శిరోధార్యమని చెప్పినట్లు తెలిసింది. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు తమకు అవకాశం ఇస్తే అధ్యక్ష బాధ్యతలు నిర్వహించేందుకు సిద్ధమని చెప్పినట్లు సమాచారం. చివరకు ముఖ్య నాయకులంతా కలిసి మూడు సామాజిక వర్గాలకు సంబంధించిన ఒంగోలు, మార్కాపురం ఎమ్మెల్యేలు జనార్దన్, కందుల నారాయణరెడ్డితోపాటు ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు పేర్లను రాష్ట్ర పార్టీకి సిఫార్సు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ప్రస్తుత అధ్యక్షుడు బాలాజీ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఉన్నందున కొత్త వారికే అవకాశం ఇవ్వాలని సభ్యులంతా సూచించడం విశేషం. మహిళా కోటాతోపాటు ఆయా సామాజికవర్గాలను పరిగణనలోకి తీసుకొని సీఎం చంద్రబాబు ఎవరికి అవకాశం ఇచ్చినా తమకు సమ్మతమేనంటూ నాయకులు త్రిసభ్య కమిటీకి స్పష్టంగా చెప్పారు.

అనుబంధ సంఘాల అధ్యక్షులపై చర్చ

అనుబంధ సంఘాల అధ్యక్షుల ఎంపికపై కూడా మంత్రి, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులతో త్రిసభ్య కమిటీ చర్చించింది. మొత్తం 18 అనుబంధ సంఘాలకు సంబంధించి ఆయా నియోజకవర్గాలకు కొన్ని పదవులు కేటాయిస్తూ అధ్యక్ష పదవి పేర్లు అక్కడి ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు సూచించేలా నిర్ణయం తీసుకున్నారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గానికి తెలుగు యువత, తెలుగు మహిళ జిల్లా అధ్యక్ష పదవులను కేటాయించారు. తెలుగు రైతు అధ్యక్ష పదవిని దర్శి నియోజకవర్గానికి ఇవ్వాలని నిర్ణయించారు. లీగల్ విభాగం జిల్లా అధ్యక్ష పదవి గిద్దలూరుకు కేటాయించారు. మిగిలిన నియోజకవర్గాలకు ఆయా విభాగాల అధ్యక్ష పదవులను కేటాయించి పేర్లు సూచించాలని ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులను త్రిసభ్య కమిటీ కోరినట్లు తెలిసింది.



సండే ఆన్ సైకిల్

ఫిట్ ఇండియాలో భాగంగా 'సండే ఆన్ సైకిల్' కార్యక్రమాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ దామోదర్ ప్రారంభించారు. పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఫిట్ ఇండియా కార్యక్రమం ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కీలక అడుగు అన్నారు.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు క్రైం

ఒడా ఛైర్మన్‌గా రియాజ్

నేడు ప్రమాణ స్వీకారం

భారీ ఏర్పాట్లు చేసిన జనసేన పార్టీ నేతలు

హాజరుకానున్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు



ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఒడా) ఛైర్మన్‌గా షేక్ రియాజ్ సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయన జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. దీంతో ఆ పార్టీ నాయకులు భారీ ఏర్పాట్లు చేశారు. నగరంలో పెద్దఎత్తున ఫ్లెక్సీలు, జనసేన పార్టీ జెండాలను ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు గుంటూరు రోడ్డులోని ఏ-1 కన్వెన్షన్ హాలులో రియాజ్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. జనసేన పార్టీ మంత్రులతోపాటు ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీలు, శాసనసభ్యులు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు, నాయకులు భారీగా తరలిరానున్నారు.

సమన్వయంతో ప్రతిష్ఠ పెంచుతా

'ఆంధ్రజ్యోతి'తో ఒడా ఛైర్మన్ రియాజ్ 5



అయోమయంలో డీఎస్సీ అభ్యర్థులు

నేటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

ఖరారుకాని ఎంపిక జాబితా

-5వ పేజీలో



ఆర్ఎస్ఎస్ జపం.. కార్పొరేట్లకు ఊడిగం

సీపీఐ రాష్ట్ర మహాసభల్లో జాతీయ నాయకురాలు పర్వీన్ -5వ పేజీలో



మర్రిపూడికి వీడని గ్రహణం

అధికారుల తప్పిదంతో ఆస్తులున్నా అమ్ముకోలేని దుస్థితి -5వ పేజీలో

రైతుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కృషి



చెరుకూరులో మంత్రి స్వామిని సన్మానిస్తున్న నాయకులు



టంగుటూరు సొసైటీ కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారంలో పాల్గొన్న మంత్రి స్వామి

● మంత్రి డాక్టర్ స్వామి

పొన్నలూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి చెప్పారు. మండలంలోని చెరుకూరు గ్రామంలో ఆయన స్థానిక టీడీపీ నేతలతో సమావేశమయ్యారు. చెరుకూరి సొసైటీకి నూతన పాలకవర్గం ఏర్పాటైన సందర్భంగా కమిటీని అభినందించేందుకు ఆదివారం మంత్రి చెరుకూరు వచ్చారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు మంత్రికి ఘన స్వాగతం పలుకుతూ సొసైటీ కార్యాలయం వరకూ ర్యాలీగా తీసుకొచ్చారు. అనంతరం సొసైటీ చైర్మన్‌గా నియమితులైన వడ్డే మాల్యాద్రి, డైరెక్టర్లు కె.మాల్యాద్రి, ఎం ఆదెయ్యలకు అభినందనలు తెలిపారు. అనంతరం స్వామి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం పెట్టుబడి నిధులు రాయితీతో వ్యవసాయ పరికరాలను ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. కొత్తగా నియమితులైన పాలకవర్గ సభ్యులు, నిత్యం రైతులకు అందుబాటులో ఉండి వారికి మేలు జరిగేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు అనుమోలు సాంబశివరావు, మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కర్ణ కోటిరెడ్డి, మండవ ప్రసాద్, ఆరికట్ల సుబ్బానాయుడు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు బ్రహ్మయ్య, మండవ మురళీమోహన్, ఉన్నం శ్రీనివాసరావు, దాసరి కృష్ణారావు, మన్నెం రమణయ్య, నేలపాటి వెంకటేశ్వర్లు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు

టంగుటూరు/కొండపి): టంగుటూరు పీఏసీఎస్ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. ఆదివారం టంగుటూరులోని పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో పీఏసీఎస్ చైర్మన్ మక్కెన హరిబాబు, మెంబర్లు కోటపాటి వెంకటేశ్వర్లు, యరమోసు సుధాకర్ ప్రమాణ స్వీకారంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని మంత్రి స్వామి అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు, నాయకులు బెల్లం జయంత్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు చదలవాడ చంద్రశేఖర్, మాజీ అధ్యక్షుడు కామని విజయ్ కుమార్ రైతులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల





మట్టితో వినాయక ప్రతిమలను రూపొందించిన చిన్నారులు

ఉత్సాహంగా భళా గణేష్..!

● పర్యావరణ వినాయక ప్రతిమల పోటీకి విశేష స్పందన

వినాయకచవితి పండుగను పురస్కరించుకుని డీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'భళా..గణేష్' పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆదివారం ఒంగోలులోని రవిప్రియమాల్‌లో మట్టి వినాయక విగ్రహాల తయారీకి చిన్నారులు, యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ పోటీలను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రారంభించగా, ట్రస్ట్ ప్రతినిధులు దామచర్ల నాగసత్యలత, అనీషాలక్ష్మీలు పర్యవేక్షించారు. 10-15 సంవత్సరాల వయస్సు వారికి ఒక విభాగం, 15-25 వయస్సు వారికి వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. విజేతలకు మొదటి బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు, మూడవ బహుమతి రూ.2వేలు, పాల్గొన్న వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చిన్నారులను అభినందించారు. కార్యక్రమంలో ఒడా చైర్మన్ షేక్ రియాజ్, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి శీతారామయ్య, నగర కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- ఒంగోలు కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి)

బ్యాడ్మింటన్‌లో చీమకుర్తివాసి ప్రతిభ

● జాతీయస్థాయి పోటీల్లో కాంస్య పతకం

చీమకుర్తి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో చీమకుర్తి పట్టణానికి చెందిన యువకుడు మహ్మద్ కరామతుల్‌హక్ కాంస్యపతకాన్ని కైవసం చేసుకున్నాడు. హైదరాబాద్‌లో జరిగిన జూనియర్ ఇంటర్నేషనల్ మిక్స్‌డ్ డబుల్ పోటీల్లో కరామతుల్ తన పార్ట్‌నర్ దీపిక దేవనబోయినతో కలిసి కాంస్య పతకాన్ని పొందారు. సాధించాడు. ఈనెల 19నుంచి 24వ తేదీ వరకూ జరిగిన ఈ పోటీల్లో వివిధ దేశాల నుంచి దాదాపు 500మంది క్రీడాకారులు పోటీ పడటం విశేషం. పుల్లెల గోపీచంద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కరామతుల్ చీమకుర్తిలోని డాక్టర్ చెరుకూరి వెంకటేశ్వర్లు ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్‌లో ఓనమాలు నేర్చుకొని జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధించాడు. ఇతని తండ్రి కరీముల్లా బ్యాండ్మింటన్ క్రీడాకారుడు. తన మార్గదర్శకత్వంలో బ్యాడ్మింటన్ పోటీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించే లక్ష్యంతో కఠోర పరిశ్రమ చేస్తున్నాడు. చిన్న వయస్సులోనే అద్భుత ప్రతిభాపాటవాలు ప్రదర్శిస్తూ పలు పోటీల్లో విజేతగా నిలుస్తున్న కరామతుల్‌హక్‌ని పలువురు అభినందించారు.



ట్రోఫీతో కరామతుల్‌హక్

ది రెయిన్బో ఆఫ్ ఆర్టికల్స్ పుస్తకం ఆవిష్కరణ

సంతనూతలపాడు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పి.గుడిపాడు డొంక సమీపంలోని కృష్ణసాయి గ్రానైట్ ఫ్యాక్టరీలో ది రెయిన్బో ఆఫ్ ఆర్టికల్స్ పుస్తకాన్ని పారిశ్రామికవేత్త, కృష్ణసాయి గ్రానైట్స్ సంస్థల ఎండీ శిద్దా హనుమంతరావు ఆదివారం ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని రిటైర్డ్ ప్రిన్సిపాల్ గల్లా గోవిందయ్య రచించారు. ఈ సందర్భంగా శిద్దా హనుమంతరావు మాట్లాడుతూ నాడు 1979-80లో మాకు పాఠాలు బోధించిన ఆదర్శప్రాయనీయుడైన రిటైర్డ్ ప్రిన్సిపాల్ గోవిందయ్య రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించే అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం గోవిందయ్యను ఘనంగా సత్కరించారు. అలాగే శిద్దా హను మంతరావును పూర్వవిద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో శివకోటేశ్వరరావు, కాజామొహిద్దీన్, రామాంజనేయులు, వెంకటేశ్వర్లు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శిద్దా హనుమంతరావు, పూర్వ విద్యార్థులు

కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

సంతనూతలపాడు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు విమర్శించారు. సీఐటీయూ మండల మహాసభ సంతనూతలపాడులోని సుందరయ్యభవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసేవిధంగా వ్యవహరిస్తూ దేశాన్ని ఛిన్నాభిన్నం చేస్తోందని ఆరోపించారు. విశాఖస్టీల్‌ప్లాంట్‌ను కారుచౌకగా అమ్మేందుకు ప్రయత్నిస్తుంటే రాష్ట్రంలో పార్టీలు మద్దతు ఇచ్చేలా వ్యవహరి స్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎన్.వెంకటేశ్వర్లు, బి.సుబ్బారావు, షేక్ మస్తాన్, భవానీ, కృష్ణవేణి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణ భగవాన్ ఊరేగింపు



స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

జరుగుమల్లి/కొండపి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక ఒంగోలుకు చెందిన భక్తుల ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని గొంగటిరెడ్డిపాలెం, వర్ధినేని వారిపాలేల్లో శ్రీకృష్ణుని ప్రతిమను ఊరేగించారు. తొమ్మిదిరోజులపాటు గొంగటిరెడ్డిపాలెంలో ప్రతిమకు నిత్య పూజలు చేసిన భక్తులు ఆదివారం రెండు గ్రామాల్లో గ్రామోత్సవం చేశారు. ఈసందర్భంగా భక్తులు, చిన్నారులు భగవద్గీత శ్లోక ఉచ్చారణ చేశారు. కార్యక్రమంలో జిల్లాలోని దొనకొండ, కంభం, గిద్దలూరు కమిటీ సభ్యులు, గుంటూరు, చిలకలూరిపేట, పిడుగురాళ్ల కమిటీ సభ్యులు జిల్లా కమిటీ అధ్యక్షుడు మునగపాటి సుబ్బారావు, ఉత్సవ నిర్వాహకుడు శ్రీనివాసరెడ్డి, సభ్యులు స్రవంతి, భాస్కర్ రెడ్డి, విశ్వనాథ్, మాధవీలత, సుబ్బయ్య పాల్గొన్నారు.

ఏడుగుండ్లపాడు సర్పంచ్‌కు సత్కారం

ఒంగోలు(రూరల్), ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం హైదరీ క్లబ్‌లో ఆదివారం రాత్రి ఏడుగుండ్లపాడు గ్రామ సర్పంచ్ దాసరి శిల్పాసౌందర్యను జిల్లా కబడ్డీ అసోసియేషన్ వారు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుర్రా భాస్కరావు మాట్లాడుతూ జాతీయస్థాయిలో ఏడుగుండ్లపాడు గ్రామ పంచాయతీని అభివృద్ధి చేసిన సర్పంచ్ శిల్పా సౌందర్యకు ఉత్తమఅవార్డు దక్కడం జిల్లాకే గర్వకారణమన్నారు. ఎమ్మెల్యే బీఎస్.విజయ్ కుమార్ సహకారంతో గ్రామంలోని సమస్యలను పరిష్కరించటం హర్షణీయమని పేర్కొ న్నారు. శిల్పాసౌందర్య తండ్రి దాసరి రమేష్‌బాబు కబడ్డీ అసోసియేషన్ సభ్యుడుగా క్రీడాభివృద్ధికి తనవంతుగా సహకరిస్తున్నారని చెప్పారు. అనంతరం శిల్పాసౌందర్యను సంఘ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మా నించారు. కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ ఎన్.చంద్రమోహన్‌రెడ్డి, కార్యదర్శి వై.పూర్ణచంద్రరావు, కార్పొరేటర్ ఈదర వెంకటసురేష్‌బాబు, ఉపాధ్యక్షుడు రంగారావు, ఆరికట్ల సుమతి పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుల సంఘం నూతన కార్యవర్గం



ఎన్నికైన కమిటీ సభ్యులు

ఒంగోలు విద్య, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ఒంగోలులోని సంఘ భవనంలో జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.డేనియల్ వ్యవహరించారు. అనంతరం సంఘం గౌరవాధ్యక్షులుగా షేక్ అహ్మద్(ఫైడిపాడు), అధ్యక్షుడిగా ఎం.సుధాకర్(తర్లుబాడు), ప్రధానకార్యదర్శిగా వై.వెంకట్రావు(త్రోవగుంట), కోశాధికారిగా జీఎస్ఆర్.సాయి (పల్లామల్లి), కార్యనిర్వాహక కార్యదర్శిగా పి.మహబూబ్‌ఖాన్(పెదకండ్లగుంట), కేంద్రకార్యదర్శిగా పి.సుధాకర్(జరుగుమల్లి), రాష్ట్ర కౌన్సిలర్లుగా ఎం.శ్రీనివాసరావు (కె.బిట్రగుంట), షేక్‌ఖాదర్‌మస్తాన్ (దర్శి), ఎం.విజయ భాస్కరరెడ్డి(ఆకవీడు), ఒంగోలు డివిజన్ అధ్యక్షులుగా కేసీహెచ్.సుబ్బారావు, కార్యదర్శిగా ఎస్‌వీ.రాంబాబు, మార్కాపురం డివిజన్ అధ్యక్షకార్యదర్శులుగా టి.శ్రీనివాసరెడ్డి, ఎస్.నాగేశ్వరరావులను సభ్యులు ఎన్నుకున్నారు.

జేఏసీ నూతన కార్యవర్గం ఏకగ్రీవం

చీమకుర్తి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అణగారిన కులాల ఐక్యవేదిక(జేఏసీ) నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం వ్యవస్థాక అధ్యక్షుడు పేరం శ్రీనివాసరావు అధ్యక్షతన చీమకుర్తిలో జరిగింది. నూతన అధ్యక్షుడిగా బండ్ల కొండలరావు, ప్రధానకార్యదర్శిగా కోనేటి చందు, ఉపాధ్యక్షులుగా జంషీర్, కార్యదర్శిగా అత్యాల దావీదు, కోశాధికారిగా పాలపర్తి శ్రీకాంత్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో షేక్ ఖాదర్‌బాషా, తెల్లమేకల గాంధీ, పాటిబండ్ల గంగయ్య, బలగాని ఆంజనేయులు, అశోక్, ఇస్తర్ల కొండలు, బత్తుల మల్లిఖార్జునరావు, యలమందబాబు, రాజు, సిద్ధయ్య పాల్గొన్నారు.

రసరమ్యంగా స్వర రాగ సుధాగానం



సంకీర్తనలను ఆలపిస్తున్న గాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): స్వరరాగ సుధ సంస్థ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక మంగమూరు రోడ్డు గాయత్రి మందిరంలో నిర్వహించిన శాస్త్రీయ సంగీత కార్యక్రమం ప్రేక్షకులను అలరించింది. ప్రఖ్యాత సంగీత విద్వాంసులు కుందుర్తి చలపతిరావు శత జయంతి సందర్భంగా నివాళులర్పించారు. అనంతరం కుందుర్తి శ్రీనివాసమర్తిత, డాక్టర్ కేఆర్‌వీ.ప్రసాద్, వై.కార్తికేయ, ఎస్.హనుమంతరావు, టి.రేవతి, కుందుర్తి సుబ్బలక్ష్మి, కె.సరోజిని, బి.ఫణిదీప్తి, జి.కళ్యాణి, పి.పద్మ సురేష్, పి.యదువంశిక అన్నమాచార్య సంకీర్తనలను ఆలపించారు. మృదంగంపై అరవింద్ వాద్యసహకారాన్ని అందజేశారు.

ఎమ్మెల్యే బాలకృష్ణకు శుభాకాంక్షలు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ యూకే గోల్డ్ ఎడిషన్‌లో పేరు సాధించిన సినీ హీరో, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి శుభాకాంక్షలు తెలిపారు. ఈ శుభ పరిణామం యావత్ తెలుగు జాతికి గర్వకారణం అన్నారు. బాలకృష్ణ 50 ఏళ్ళుగా సినిమాల్లో నటిస్తూ విలక్షణ పాత్రలతో కోట్లాది మంది అభిమానుల మనసులు గెలుచుకున్నారని, తండ్రికి తగ్గ తనయుడుగా సినీ, రాజకీయ రంగాల్లో రాణిస్తున్నారని కొనియాడారు. ఏ రంగంలో ఉన్నా ప్రజాసేవే పరమావధిగా పనిచేస్తారని అభినందించారు.

చీమకుర్తి యువకుడికి జిల్లా ఫస్ట్ ర్యాంకు

● డీఎస్సీ స్కూల్‌అసిస్టెంట్ బయాలజీలో ప్రతిభ



సురేష్‌కుమార్

చీమకుర్తి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఫలితాల్లో చీమకుర్తి యువకుడికి జిల్లాస్థాయిలో ఫస్ట్‌ర్యాంకు దక్కింది. స్కూల్ అసిస్టెంట్ బయాలజీ సబ్జెక్ట్‌లో 86.73 శాతం మార్కులు సాధించిన ఇష్టంశెట్టి సురేష్ కుమార్ ప్రథమస్థానాన్ని కైవసం చేసుకున్నారు. చీమకుర్తి పట్టణంలో వీవర్స్‌కాలనీకి చెందిన సురేష్‌కుమార్ కడు పేదరికంలో ఉండి గత నాలుగేళ్లుగా డీఎస్సీలో విజయమే లక్ష్యంగా అకుంఠిత దీక్షతో చదివారు. తండ్రిని కోల్పోయినా ఇంటికి పెద్ద దిక్కు తానై కుటుంబాన్ని పోషించుకుంటూ ఉద్యోగాన్ని సాధించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వటంతో తన జీవితాశయం నెరవేరిందని, విద్యాశాఖామంత్రి లోకేష్‌కు, ప్రభుత్వానికి తమ కుటుంబం ఎంతో రుణపడి ఉంటుందని సురేష్‌కుమార్ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. తాను బాధ్యతాయుతంగా ఉద్యోగాన్ని నిర్వర్తించి ప్రభుత్వపాఠశాలలో విద్యార్థుల విద్యాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. చీమకుర్తిలో పలువురు సురేష్‌కుమార్‌ని ప్రత్యేకంగా అభినందించారు.

ముగిసిన పుస్తక ప్రదర్శన

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో ఒంగోలులో నిర్వహించిన పుస్తక ప్రదర్శన ఆదివారం ఘనంగా ముగిసింది. ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు ఏర్పాటు చేయగా విజయవంతంగా కొనసాగింది. పదిరోజులపాటు జరిగిన ప్రదర్శనలో సుమారు లక్షకు పైగా పుస్తక ప్రియులు సందర్శించగా సుమారు 50వేలకు పైగా పుస్తకాలు అమ్మకాలు జరిగాయి. విద్యార్థులు, గృహిణులు, ఉద్యోగులు, వివిధ రంగాల కళాకారులు, సాహితీవేత్తలు, రచయితలతోపాటు పలువురు పుస్తక ప్రదర్శనను వీక్షించి తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మనోహర్‌నాయుడు మాట్లాడుతూ ఒంగోలులో మూడుసార్లు పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయగా జిల్లా ప్రజలు ఆదరించారని తెలిపారు. పలువురు ప్రముఖులు తమ సహకారం అందించారని చెప్పారు. జిల్లా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు పొన్నూరు వేంకటశ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, పుస్తక మహోత్సవ అధ్యక్షులు లక్ష్మయ్య, అన్నా విజయకుమారి, పాలూరి శివప్రసాద్, టి.అరుణ, రత్నం, పిన్ని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

35 మందికి వైద్య పరీక్షలు

కొండపి, ఆగస్టు24 (ఆంధ్రజ్యోతి): కొండపి గ్రామ పంచాయతీ పరిధిలోని కట్టావారిపాలెంలోని స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 35 మంది రోగులకు ఒంగోలుకు చెందిన డాక్టర్ కంకణాల కృష్ణమోహన్ వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్నారై డాక్టర్ రావెళ్ల రాజారావు దంపతులు, గ్రామపెద్దలు మానికొండ వెంకటేశ్వర్లు, బొక్కిసం సుబ్బారావు, వీరమోసు మస్తాన్‌రావు, ఆరోగ్య శిబిరం భవన దాత గుంటుపల్లి పద్మావతి పాల్గొన్నారు.

వివాహ పరిచయ వేదికకు స్పందన

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : విశ్వకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో విశ్వబ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదిక జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన విజయవాడ మెట్రోపాలిటి మేజిస్ట్రేట్ శ్రీదేవు నరసింహారావు మాట్లాడుతూ ఉచిత వివాహ పరిచయ వేదికను అవివాహితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి మాట్లాడుతూ వేదిక కార్యక్రమానికి సుమారు 200మంది హాజరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో నిర్వహకులు అండలూరి రవీంద్రాచారి, ఏలూరి వీరబ్రహ్మాచారి, ఉద్యోగ సంఘ నాయకులు చోడా వెంకటసుబ్బారావు, ఫణిదపు సుధాకర్, బి.వెంకటేశ్వర్లు, తాతాచారి, సామంతపూడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మెప్మా ఆర్పీ ఉద్యోగుల కార్యవర్గం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఏపీ మెప్మా ఆర్పీ ఉద్యోగుల సంఘం(సీఐటీయూ) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఒంగోలులో ఆదివారం సంఘం రెండవ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షురాలిగా దారా రూతమ్మ, ప్రధానకార్యదర్శిగా నారాయణస్వామి రాజ్యలక్ష్మి, కోశాధికారిగా పమిడి పద్మశ్రీ, సహాయ కార్యదర్శిగా జమ్మలమడుగు సుజాత, నయోమి, ఉపాధ్యక్షులుగా పి.ఆదిలక్ష్మి, గౌరవాధ్యక్షులుగా జె.కల్పనతో పాటు మరో 11 మందితో కమిటీని ఎన్నుకున్నారు. అంతకు ముందు బి.విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ.కొండారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రతినిధులు సాయిలక్ష్మి, రేణుక, రమణ, దివ్య శాంతి, శ్రీలక్ష్మి, చంద్రిక, భారతి, ఆదిలక్ష్మి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

నేడు మార్కాపురం ఏఎంసీ చైర్మన్ ప్రమాణ స్వీకారం

● హాజరు కానున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు

మార్కాపురం రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం సోమవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, ఆనం రామనారాయణరెడ్డి, బీసీ జనార్దన్, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డితోపాటు ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జిలు, నాయకులు హాజరవుతున్నట్లు ఏఎంసీ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి తెలిపారు. కూటమి శ్రేణులు హాజరుకావాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

ఘనంగా వెంకయ్యస్వామి ఆరాధన

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా భగవాన్ శ్రీ గొలగమూడి వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఒంగోలు నగరం సంతపేటలోని వెంకయ్యస్వామి మందిరంలో కొలువై ఉన్న వెంకయ్యస్వామికి అర్చకులు రాముశర్మ సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో పుష్పాలంకరణ చేసి పూజా క్రతువులను శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం అధిక సంఖ్యలో హాజరైన భక్తులకు అన్నప్రసాద వితరణన చేశారు. మందిర నిర్వహకులు ఆవుల బ్రహ్మయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉలిచిలో..

ఒంగోలు(రూరల్): ఒంగోలు మండలం ఉలిచిలో ఆదివారం శ్రీభగవాన్ వెంకయ్యస్వామి వారి ఆరాధనోత్సవాలను గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం జరిగింది.


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఆర్‌ఎస్‌ఎస్ జపం.. కార్పొరేట్లకు ఊడిగం

మోదీ పాలనపై మండిపడ్డ సీపీఐ జాతీయ నాయకురాలు వహీదా నిజాంపర్వీన్

బీజేపీని గద్దెదించేందుకు పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపు

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి వామపక్షాలు ఐక్య కృషి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఒంగోలు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వంలో రాజ్యాంగ వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయని సీపీఐ జాతీయ నాయకురాలు వహీదానిజాం పర్వీన్ ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యం ఆర్‌ఎస్‌ఎస్ జపం, కార్పొరేట్లకు ఊ డిగం తప్ప మోదీ ప్రభుత్వం ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వారి విధానాలు, చర్యలతో భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్య ప్రమాదంలో పడ్డాయని, వాటిని రక్షించుకొనేందుకు కమ్యూనిస్టులు నడుంకట్టాలని పిలుపునిచ్చారు. ఒంగోలులో జరుగుతున్న సీపీఐ 28వ రాష్ట్ర మహాసభల్లో భాగంగా ఆదివారం స్థానిక ప్రైవేటు ఫంక్షన్‌హాలులో జరిగిన ప్రతినిధుల సభను వహిదా ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బీజేపీకి భారత రాజ్యాంగంపట్ల ఏమాత్రం గౌరవం లేదన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ అయితే రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తూ తమ అధికారపత్రికలో సంపాదకీయమే రాసిందన్నారు. బీజేపీ పాలనలో ప్రజాస్వామిక, లౌకిక సమాఖ్య స్వరూపాలకు ముప్పు వాటిల్లిందని, రాజ్యాంగబద్ధ సంస్థలను తమ చేతుల్లోకి తీసుకొని ప్రతిపక్ష పార్టీలను, ప్రశ్నించే గొంతులను లేకుండా చేస్తున్నదని దుయ్యబట్టారు. గతంలో ఎన్నడూ లేనంత విధంగా కమ్యూనిస్టు భావజాలంపై ఆర్‌ఎస్‌ఎస్ అనుకూలుర దాడి పెరిగిందన్నారు. ఈ భావాజాల దాడిని ప్రతిఘటించాలన్నా, దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకోవాలన్నా కమ్యూనిస్టుల పునాది బలంగా ఉండాలన్నారు. అందుకోసం ప్రతి కార్యకర్త ప్రతినబూనాలని, ప్రజాశ్రేయస్సు కోసం బీజేపీని గద్దెదించేందుకు పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.

అఖిలభారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య మాట్లాడుతూ పలు రాష్ట్రాలలో భూసేకరణ చట్టాలను పక్కనపెట్టి భూసమీకరణ పేరుతో భూములు లాక్కునే ప్రయత్నాలను ఆయా ప్రభుత్వాలు చేస్తున్నాయని,వాటికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజ్యాతిరేకకార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ కమ్యూనిస్టుపార్టీలు, వామపక్ష, లౌకిక ప్రజాతంత్ర శక్తులు ఐక్య పోరాటాలను నిర్వహించాలన్నారు. ప్రశ్నించడానికే సేన పుట్టిందని చెప్పిన పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చాక ప్రశ్నించడమే మానేశారన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం వామపక్షాలు ఐక్యంగా కృషి చేస్తాయన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేయకుండా రూ.82వేల కోట్లతో పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు జపం చేయడం ఎవరి ప్రయోజనాల కోసమని ప్రశ్నించారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టు పార్టీల అండగా నిలవాలన్నారు. తొలుత సంప్రదాయంగా ఎర్రజెండా ఆవిష్కరణ చేయాల్సి ఉండగా అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి మృతితో ఆ కార్యక్రమాన్ని రద్దు చేయగా అమరవీరుల స్థూపాన్ని మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖరరావు ఆవిష్కరించారు. సురవరంతో పాటు పలువురు వామపక్ష నేతలకుమహాసభ నివాళి అర్పించింది. కాగా మహాసభలకు హాజరైన ప్రతినిధులకు ఆహ్వాన సంఘం తరుపున ప్రముఖకమ్యూనిస్టునేత నల్లూరి వెంకటేశ్వర్లు స్వాగతం పలికారు. జిల్లాలో ఉత్సాహపూరితంగా ప్రారంభమైన మహాసభలకు పార్టీ రాష్ట్ర సహాయకార్యదర్శి జేవీవీఎస్ సత్యనారాయణ మూర్తి బృందం అధ్యక్షవర్గంగా వ్యవహరించగా జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర నాయకులు కేవీవీ ప్రసాద్, జి. ఈశ్వరయ్య, జగదీష్, ఆర్. రవీంద్రనాథ్, జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు ల్యాప్ టాప్‌లు, స్కాలర్ షిప్‌లు అందజేస్తున్న కమ్మకార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మంచౌదరి, స్థానిక నేతలు

అన్ని సామాజిక వర్గాల అభివృద్ధికి కృషి

కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి

25 మంది విద్యార్థులకు ల్యాప్ టాప్‌లు, రూ.6లక్షల స్కాలర్ షిప్ చెక్కులు అందజేత

ఒంగోలు (రూరల్),ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): కమ్మ సామాజక వర్గంతో పాటు వివిధ సామజక వర్గ పేదల అభివృద్ధికి తన సహకారం ఉంటుందని కమ్మకార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి పేర్కొన్నారు. ఒంగోలు నగరంలోని బృందావనం ఫంక్షన్ హాల్లో ఆదివారం కమ్మ సేవా సంఘం వారిచే పేద విద్యార్థులకు ల్యాప్ టాప్‌లు, స్కాలర్‌షిప్‌ల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న బ్రహ్మం చౌదరి మాట్లాడుతూ సమాజంలో అన్ని సామాజక వర్గాల వారు విద్య ఆర్థిక రంగాలలో అభివృద్ధి చెందాలన్నారు. కమ్మకులస్థులలో ఆర్థికంగా వెనుకబడిన వారికి, తల్లితండ్రి లేని వారికి చేయూత కోసం తనవంతు సహకారం ఉంటుందన్నారు. కమ్మకార్పొరేషన్‌కు టోల్ ఫ్రీనంబరు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా కమ్మవారి సేవా సంఘం అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ కమ్మవిద్యార్థులతో పాటు వివిధకులాల పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, స్కాలర్ షిప్‌లు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ చదువుతున్న వివిధ సామాజిక వర్గాల పేద విద్యార్థినీ విద్యార్థులు 25 మందికి ల్యాప్ టాప్‌లు, 6లక్షల రూపాయలు స్కాలర్ షిప్‌లు చెక్‌లు అందజేశారు.

ఈకార్యక్రమంలో పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, కమ్మవారి సేవాసంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు చిడిపోతు వెంకటేశ్వర్లు, సంఘ కన్వీనర్ కాట్రగడ్డ రఘుపతి రావు, సంఘ ప్రధానకార్యదర్శి ఆలా హనుమంతరావు, వన్‌కే డోనర్స్ క్లబ్ చైర్మన్ పాటిబండ్ల వెంకటేశ్వర్లు, కోశాధికారి గార్లపాటి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు పావులూరి బాపయ్య చౌదరి, అబ్బూరి పవన్‌కుమార్, మహిళా నాయకులు డాక్టర్ మండవ కమలా సుభాష్, వడ్డెంపూడి సుజాత, రావులపద్మ, కోటపాటి కాశీరావు, కంచర్ల నారాయణ, ప్రతిభ కళాశాలల చైర్మన్ ఎన్. వెంకటేశ్వర్లు, మండవ సుబ్బారావు, గోగినేని శ్రీనివాసరావు, కరిచేటి చంద్రశేఖర్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు

వైసీపీవి మతిస్థిమితం లేని విమర్శలు

● మంత్రి సంధ్యారాణి


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : 'అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఎన్నికల హామీలైన సూపర్ సిక్స్ పథకాలను అమల్లోకి తెచ్చి సూపర్ హిట్ చేశాం. కానీ వైసీపీ నేతలు పథకాలు అమలు కావడం లేదని వ్యాఖ్యానించడం చూస్తుంటే వారికి మతిస్థిమితం లేదని అర్థమవుతుంది. వారి విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదు' అని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు.

ఆదివారం ఒంగోలు పార్లమెంట్ ముఖ్యనాయకుల విస్తృతస్థాయి సమావేశానికి పరిశీలకులుగా వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడారు. వాస్తవాలను వక్రీకరించి అబద్ధాలు చెప్పడం జగన్‌రెడ్డికి అలవాటే అన్నారు. బాబాయిని నరికి చంపి గుండెపోటుగా చిత్రీకరించడం.. తల్లిని, చెల్లిని తరిమేసి అబద్ధాలు చెప్పడం అందరికీ తెలుసన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ కావడంతో కడుపుమంటతో విమర్శలు చేస్తున్నారన్నారు. వైసీపీ అధినేతకే మతిస్థిమితం లేనప్పుడు ఇక ఆపార్టీ నాయకులు ఎలా ఉంటారో అర్థంచేసుకోవచ్చని ఎద్దేవా చేశారు. సొంత కుటుంబ సభ్యుడినే చంపిన లీడర్‌కు, విజన్ కలిగిన నాయకుడికి పోలికలేదన్నారు. నేడు రాష్ట్రంలో ప్రతి కుటుంబం సంతోషంగా ఉందన్నారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించేది తెలుగుదేశం పార్టీనే అన్నారు. గతంలోనూ వారి సంక్షేమం కోసం పాటుపడింది చంద్రబాబు నాయుడు అన్న విషయం అందరికీ తెలుసని మంత్రి స్పష్టం చేశారు.


మర్రిపూడి గ్రామం వ్యూ

ఆస్తులున్నా అమ్ముకోలేని దైన్యం

● అధికారులు చేసిన తప్పిదంతో ఇక్కట్లు
● 547 సర్వే నంబర్ మొత్తం దేవదాయ భూమిగా నమోదు
● నిషేధిత జాబితా నుంచి విడిపించాలని మంత్రి ఆదేశం
● అయినా కదలని దేవదాయ, రెవెన్యూ అధికారులు

మర్రిపూడి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : అధికారులు చేసిన చిన్న తప్పిదానికి మర్రిపూడి గ్రామస్థులు అల్లాడిపోతున్నారు. సొంత ఆస్తులు ఉన్నా అమ్ముకోలేని దుస్థితితో కొట్టుమిట్టాడుతున్నారు. కంటిముందు లక్షలాది రూపాయలు విలువ చేసే ఆస్తులు ఉన్నా అవసరానికి చేతిలో చిల్లిగవ్వ లేని నిరుపేదలుగా జీవనం గడుపుతున్నారు. దేవదాయ, రెవెన్యూ శాఖల అధికారులు నిర్లక్ష్యం వారి పాలిట శాపంగా మారింది. నిషేధిత జాబితాలో ఉన్న స్థలాలను, ఇళ్లను విడిపించాలని పాలకులను కలిసి మొరపెట్టుకుంటున్నప్పటికీ ఉపయోగం లేదు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రభుత్వం నిర్వహించిన గ్రామసభలలో చేసుకున్న విజ్ఞాపనలను సైతం అధికారులు బుట్టదాఖలు చేశారు. మర్రిపూడి గ్రామంలోని 547 సర్వే నెంబరులో 43.25ఎకరాలు గ్రామకంఠం భూమి ఉంది. అందులో ఇళ్లస్థలాలు, పక్కాభవనాలు ఎన్నో ఏళ్లుగా ఉన్నాయి. అదే గ్రామ సర్వే నంబరులో 40సెంట్ల విస్తీర్ణంలో పార్వతీసమేత రామలింగేశ్వరస్వామి, రాధారుక్మిణి సమేత వేణుగోపాలస్వామి దేవాలయాలను వందల ఏళ్ల క్రితం నిర్మించారు. ఆ సర్వే నంబరులో ఉన్న 40సెంట్ల దేవదాయ స్థలాన్ని సబ్‌డివిజన్ చేసి రికార్డుల్లో నమోదు చేసిఉంటే గ్రామస్థులకు ఈ ఇక్కట్లు ఉండేవికావు. ఆ సర్వే నంబర్‌లో ఉన్న 43.25ఎకరాల భూమిని దేవదాయ భూమిగా నమోదు చేశారు. అధికారులు చేసిన తప్పిదంతో ఆ సర్వే నంబరులో ఉన్న భూమి అంతా దేవదాయ శాఖ పరిధిలోకి వెళ్లింది. ఏ కొద్దిపాటి అవసరానికి కూడా సొంత ఆస్తులున్నా అమ్ముకోలేక గ్రామస్థులు తీరని మనోవేదనకు గురవుతున్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు చికిత్సలు చేయించకోలేక ఇబ్బందులు పడుతున్నారు.

దేవదాయ శాఖ అధికారులను మంత్రి ఆదేశించినా...

ఇటీవల మర్రిపూడిలో రాష్ట్రమంత్రి స్వామి ప్రత్యేక గ్రామ సభనిర్వహించి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని దేవదాయశాఖ సహాయ కమిషనర్ పానకాలరావును, అప్పటి తహసీల్దార్ జ్వాలా నరసింహారావులకు ఆదేశాలు జారీ చేశారు. సబ్‌డివిజన్ చేసి దేవదాయ భూమిని విడగొట్టి నిషేధిత జాబితా నుంచి విడిపిస్తామని చెప్పిన అధికారులు ఆ తరువాత ఆ ఊసే మరిచిపోయారు.

సమన్వయంతో ప్రతిష్ట పెంచుతా

'ఆంధ్రజ్యోతి'తో ఒడా చైర్మన్ రియాజ్

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

సమన్వయంతో పనిచేసి ప్రజాప్రభుత్వం ప్రతిష్ఠను పెంచుతానని ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఒడా) చైర్మన్‌గా నియమితులైన షేక్ రియాజ్ స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షుడుగా ఉన్న రియాజ్ ఇటీవల ప్రతిష్ఠాత్మకమైన ఒడా చైర్మన్‌గా నియమితులయ్యారు. సోమవారం ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడారు. జనసేన ఏర్పాటుకు ముందునుంచి పవన్ కల్యాణ్ వద్ద తాను పనిచేస్తూ పార్టీ ఆవిర్భావం అనంతరం అభివృద్ధికి తనవంతు కృషి చేశానన్నారు. పదవులకు అతీతంగా పార్టీ కోసం పనిచేసిన వారికి పవన్‌కల్యాణ్ సముచిత స్థానం కల్పిస్తారనే దానికి తనకు ఒడా చైర్మన్ పదవి దక్కడమే నిదర్శనమని స్పష్టం చేశారు. టీడీపీలో ఒంగోలు ఎమ్మెల్యే జనార్దన్‌తో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్న మాట నిజమే. అదే సయమంలో ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలతో తనకు అంతే సంబంధాలు ఉన్నాయన్నారు. ఇటు పార్టీపరంగానే కాకుండా ఇటు చైర్మన్ పదవిలో కూడా టీడీపీ ఇన్‌చార్జులు, ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుని అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం నుంచి అధిక నిధులు రాబడతానని ధీమా వ్యక్తం చేశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని, తన పరిధిలో అవినీతి, అవకతవకలకు అవకాశంలేకుండా పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఒక ప్రశ్నకు బదులుగా తనకు అధికారిక పదవి వచ్చినందున జనసేన జిల్లా అధ్యక్ష పదవిని మరొకరికి కేటాయించాలని తానే సూచిస్తానని చెప్పారు. ఉమ్మడి జిల్లాలో తనతోపాటు మాల కార్పొరేషన్ పదవి, మరో రెండు డైరెక్టర్ల పదవులను జనసేనకు కేటాయించారని గుర్తు చేశారు. తదనుగుణంగా జిల్లా అధ్యక్ష పదవిని కాపు సామాజికవర్గానికి కేటాయించాలని పార్టీని కోరతానని చెప్పారు. ఒంగోలుకు చెందిన రవిప్రియమాల్ అధినేత రవిశంకర్ పేరును తాను సిఫార్సు చేస్తానన్నారు. తన ఆత్మగౌరవానికి ఇబ్బందిలేనంత వరకు పార్టీలో ఎవరినైనా కలుపుకుని ముందుకుపోతానన్నారు. రానున్న రోజుల్లో మార్కాపురం జిల్లా కూడా ఏర్పడుతున్నందున ఇటు ప్రకాశం, అటు మార్కాపురం జిల్లాలలో జనసేన పటిష్టతకు అవలంబించాల్సిన వ్యూహంపై పవన్‌కు ఒక నివేదిక ఇవ్వబోతున్నట్లు రియాజ్ చెప్పారు.

అయోమయంలో డీఎస్సీ అభ్యర్థులు

నేటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

ఖరారుకాని ఎంపిక జాబితా

ఒంగోలు విద్య, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ అభ్యర్థులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. సోమవారం నుంచి సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని ప్రకటించిన పాఠశాల విద్యాశాఖ ఆదివారం రాత్రి పది గంటలకు కూడా ఎంపిక జాబితాను ఖరారు చేయలేదు. అభ్యర్థులకు మెసేజ్‌లు, కాల్‌లెటర్లు పంపించకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం మంగళగిరిలోని పాఠశాల విద్య డైరెక్టర్ కార్యాలయంలో ఎంపిక జాబితాలపై కసరత్తు ప్రారంభించారు. అన్ని డీఈవో కార్యాలయాల ఐటీ సెల్ సిబ్బందిని అక్కడికి పిలిపించారు. ప్రాథమిక జాబితాలను పరిశీలించి వాటిలో తప్పులు గుర్తించి సవరించాలని కోరారు. ఆదివారం రాత్రికి కూడా కొలిక్కి రాలేదు. దీంతో ఈ ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుందో, అభ్యర్థులకు మెసేజ్‌లు ఎప్పుడు వస్తాయో తెలియక తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలో డీఎస్సీకి ప్రకటించిన పోస్టులు తక్కువగా ఉన్నాయి. పొరుగు జిల్లా కర్నూలులో పోస్టులు ఎక్కువగా ఉండటంతో ఇక్కడి అభ్యర్థులు అక్కడ డీఎస్సీకి నాన్‌లోకల్‌గా హాజరయ్యారు. మెసేజ్‌లు ఆలస్యంగా వస్తే అక్కడ ఉద్యోగం సాధించిన అభ్యర్థులు కర్నూలులో సర్టిఫికెట్ల పరిశీలనకు ఎప్పుడు హాజరు కావాలని ప్రశ్నిస్తున్నారు. గడువును పొడిగించాలని కోరుతున్నారు.

సర్టిఫికెట్ల పరిశీలనకు ఏర్పాట్లు పూర్తి

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన సోమవారం స్థానిక చెరువుకొమ్ముపాలెంలోని శ్రీసరస్వతి జూనియర్ కళాశాలలో ప్రారంభం కానుంది. అందుకు సంబంధించి ఆదివారం ట్రయల్ రన్ నిర్వహించారు. పరిశీలనకు నియమితులైన 18 బృందాలకు వేర్వేరుగా రూములు ఏర్పాటు చేశారు. ఏ గదిలో బృందం ఉండేది నంబరింగ్ ఇచ్చారు. అభ్యర్థులు తమ మొబైల్ ఫోన్లకు సర్టిఫికెట్ల పరిశీలనకు ఎంపికైనట్లు మెసేజ్ వచ్చాక తమ లాగిన్ ద్వారా వెబ్‌సైట్ నుంచి కాల్ లెటర్ డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత పరిశీలనకు హాజరు కావాలి.

ముగిసిన తైక్వాండో పోటీలు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కమలా హైస్కూల్‌లో 3 రోజులుగా జరుగుతున్న సీబీఎస్ఈ సౌత్ జోన్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ టోర్నమెంట్‌లో ఏపీ, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి, అండమాన్ నుంచి దాదాపు 1200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అండర్-14, 17, 19 విభాగాల్లో వివిధ కేటగిరీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందినవారికి బంగారు, వెండి, కాంస్య పతకాలు సీబీఎస్ఈ టోర్నమెంట్ అబ్జర్వర్ డా. సి.దొరై, కమలా హైస్కూల్ ప్రిన్సిపాల్ డా. స్వరూప్ రంజన్ అందజేశారు.

ఒంటరి మహిళ హత్య

ఒంటిపై బంగారం దోచుకెళ్లిన దుండగలు

సింగరాయకొండ అంబేడ్కర్ నగర్‌లో ఘటన

పరిశీలించిన డీఎస్పీ రాయపాటి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రాయపాటి, సీఐ హజరత్తయ్య, ఎస్సై మహేంద్ర

సింగరాయకొండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఒంటరి మహిళను టార్గెట్ చేసి హత్య చేసి ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను గుర్తుతెలియని దుండగులు దోచుకెళ్లారు. ఈ సంఘటన సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని అంబేడ్కర్ నగర్ 3వ లైన్‌లో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... పలుకూరు గ్రామానికి చెందిన చెరుకూరి సుబ్బాయమ్మ(57) భర్తతో విభేదాలతో 30 ఏళ్ల నుంచి అంబేడ్కర్‌నగర్‌లో నివాసం ఉంటోంది. ఆమె కొంత కాలం నుంచి స్థానిక చేపల మార్కెట్ ఎదుట బంకును ఏర్పాటుచేసుకొని జీవనం కొనసాగిస్తుంది. అంతేకాకుండా కొంత నగదుతో వడ్డీ వ్యాపారం చేస్తోంది. వడ్డీ వ్యాపారానికి సంబంధించి స్థానిక మహిళలతో విభేదాలు కూడా ఉన్నాయి. ఈక్రమంలో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు సుబ్బాయమ్మను హత్య చేశారు. ఆమె చెవులకు ఉన్న కమ్మలను, మెడలో ఉన్న బంగారు గొలుసు, చేతికి ఉన్న ఉంగరాన్ని దోచుకెళ్లారు. ఇంట్లో ఉన్న బీరువాను పగులకొట్టి అందులో ఉన్న దుస్తులను చిందరవందర చేసి కొంతనగదును కూడా అపహరించుకెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటితలుపులు తెరిచిఉండటంతో స్థానికులు గమనించి లోపలికివెళ్లి చూడగా మంచంపై సుబ్బాయమ్మ విగతజీవిగా పడి ఉంది. వెంటనే స్థానికులు వారి బంధువులు, పోలీసులకు సమాచారమిచ్చారు. ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సీఐ హజరత్తయ్య, ఎస్సై బి. మహేంద్రలు సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. స్థానికులను విచారించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ మృతురాలి ఒంటిపై ఎటువంటి గాయాలు లేవన్నారు. మొహంపై దిండుపెట్టి బలంగా వత్తి హత్యచేసి ఉండవచ్చునని అనుమానాన్ని వ్యక్తం చేశారు. మృతురాలితో విభేదాలు ఉన్నవారిని, అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు డీఎస్పీ చెప్పారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీం, వేలిముద్రలు, ఎఫ్ఎస్ఎల్ బృందం సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరించింది. అంతేకాకుండా హత్య జరిగిన ప్రదేశంలో టవర్ డంప్ పరిశీలన ద్వారా హత్యకు పాల్పడిన వారిని గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. సీఐ చావా హజరత్తయ్య కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు.

సైకిల్‌పై పోలీసుల సవారీ

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు ఆదివారం సైకిళ్లపై సవారీ నిర్వహించారు. సీఐ సుబ్బారావు మాట్లాడుతూ.. సైకిల్ తొక్కడం ఆరోగ్యానికి మేలని, దీంతో కాలుష్యం నుంచి వాతావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సిద్ధమైన గణనాథులు

- వివిధ రూపాల్లో తయారైన బొమ్మలు
- మట్టి ప్రతిమలే ముద్దంటూ ప్రచారం
- 27 నుంచి వినాయక చవితి ఉత్సవాలు

ఎర్రగొండపాలెం రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : కొలువుదీరేందుకు గణనాథులు సిద్ధమయ్యారు. వివిధ రూపాల్లో పలు రంగులతో వినాయక విగ్రహాలను తయారీదారులు అమ్మకాలకు ఉంచారు. ఈనెల 27 బుధవారం నుంచి వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో మండలంలోని మిల్లంపల్లి పంచాయితీ పరిధిలో ఆంజనేయ స్వామి దేవాలయ సమీపంలో విగ్రహాల తయారీ జోరుగా సాగుతోంది. నియోజకవర్గ పరిధిలో ఒకే ఒక్క విగ్రహాల తయారీదారు ఉన్నారు. రాజస్తాన్ ప్రాంతానికి చెందిన కుటుంబీకులు పదేళ్లుగా ఇక్కడ వినాయక విగ్రహాలు తయారు చేస్తూ భక్తుల ఆదరణ పొందుతున్నారు. చిన్నచిన్న ప్రతిమల నుంచి పెద్దపెద్ద సుమారు 15 అడుగుల ఎత్తు విగ్రహాల తయారీలో వీరు చేయి తిరిగిన వారు. ప్లాస్టిక్ రహిత విగ్రహాలను తయారుచేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రూ.5వేల నుంచి రూ.50వేల వరకు విగ్రహాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

గతంలో ఇలా

ఎర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని మండలాలు, గ్రామాలలో విగ్రహాలు కోసం ఇతర జిల్లాలకు వెళ్లి కొనుగోలు చేసి తెచ్చేవారు. కానీ ఈ ప్రాంతంలో విగ్రహాలు తయారీదారులు ఉండడంతో ఉత్సవ కమిటీలన్నీ ఇక్కడే కొనుగోలు చేస్తున్నాయి. సూదూర గ్రామాల వారు ముందుగానే వారికి నచ్చిన విగ్రహాలకు ముందస్తు ఆర్డర్లు ఇచ్చి తయారు కాగానే మండపాలకు తరలిస్తున్నారు.

మట్టి ప్రతిమలే మంచివి

పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా చవితి ఉత్సవాల్లో మట్టి ప్రతిమలను ఉపయోగించాలని పర్యావరణ ప్రేమఖులు, ప్రముఖులు గత కొన్నేళ్లుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కాగా మట్టితో చేసిన వినాయకుడిని పూజించడం శ్రేష్టమని శాస్త్రం కూడా చెప్తుంది. మరోపక్క మట్టి విగ్రహాల నిమజ్జనం పర్యావరణానికి మేలు చేస్తుంది.


వైపాలెంలో వివిధ రూపాల్లో సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

నిమజ్జనంలో జాగ్రత్తలపై పోలీస్ అధికారుల సూచనలు

కంభం : వినాయక చవితి పర్వదినం సందర్బంగా 27వ తేదీ బుధవారం నుంచి నవరాత్రి ఉత్సవాలు మొదలుకానున్నాయి. వివిధ రూపాలలో గణపతి విగ్రహాలు తయారై సిద్ధంగా ఉన్నాయి. కంభం చెరువులో 4 అడుగుల మీద నీరు ఉండడం, అలాగే తుఫాన్‌ల ప్రభావంతో నల్లమల అడవుల్లో కురిసిన భారీ వర్షాలకు జంపలేరు, గుండ్లకమ్మ వాగులలో నీరు పుష్కలంగా నీరు పారుతుండడం, తురిమెళ్ల తప్పెటవాని చెరువుకు కూడా నీరు రావడంతో కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు మండలాలలో భక్తులు ఉత్సాహంగా వందలాది మండపాలను సిద్ధం చేస్తున్నారు. వినాయకుని నిమజ్జనానికి వాగులు, వంకలు, చెరువుల్లో నీరు ఉండడంతో ప్రతి గ్రామంలో రెండు నుంచి మూడు మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. పట్టణంలో మాత్రం 50కి పైగా మండపాలు ఏర్పాటు చేస్తున్నారు.


కంభంలో కొలువుదీరేందుకు సిద్ధమైన గణనాథులు

పోలీసుల నిబంధనలు

వినాయక చవితి పండుగ సందర్భంగా కంభం మండల ప్రజలకు, ఉత్సవ కమిటీ సభ్యులకు మార్కాపురం డీఎస్పీ యూ నాగరాజు, కంభం సీఐ మల్లికార్జున, కంభం ఎస్సై నరసింహారావులు కొన్ని నియమ నిబంధనలను తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. వినాయక విగ్రహాల మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీస్ స్టేషన్‌లో గుర్తింపు కార్డులు తీసుకోవాలి. నిమజ్జనం జరిపే తేదీ, సమయం, నిమజ్జనానికి వెళ్లే మార్గం తదితర వివరాలను పోలీసులకు తెలియజేయాలని, మండల పరిధిలో ప్రధాన రహదారులకు, ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్‌కు, ప్రజలకు ఇబ్బందులు కలిగే విధంగా విగ్రహాలు పెట్టకూడదని పోలీస్ అధికారులు సూచనలు చేశారు.

ఆరు కాళ్లతో దూడ జననం

తర్లుపాడు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలుజువ్వలపాడు పంచాయతీలోని మేకలవారిపల్లెలో గేదె వింత దూడకు జన్మనిచ్చింది. గ్రామానికి చెందిన తాడి వెంకట సుబ్బారెడ్డి గేదె 2 శరీరాలు, 6 కాళ్లతో దూడను ప్రసవించింది. కలుజువ్వలపాడు పశువైద్యాధికారి సౌజన్య, ఏనుగులుదినపాడు పశువైద్యాధికారి బాలు నాయక్ కలిసి గేదెకు ఆపరేషన్ చేసి దూడను బయటకు తీశారు. కానీ దూడ అప్పటికే మరణించింది. గేదె సురక్షితంగా ఉంది.

డీఎస్సీ ఫలితాల్లో సత్తాచాటారు


భూలక్ష్మి


రమాదేవి

రాచర్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో గౌతవరం గ్రామానికి చెందిన ఆసుల భూలక్ష్మి అత్యుత్తమ ప్రతిభతో సత్తా చాటింది. ఎస్‌జీటీ విభాగంలో 93.11 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో రెండవ స్థానంలో నిలిచారు. ఉపాధ్యాయిని కావాలనే ఏకైక లక్ష్యంతో కృషి, పట్టుదలతో చదివి డీఎస్సీ పరీక్షల్లో తన ప్రతిభ చాటి తాను అనుకున్న లక్ష్యం సాధించింది. తండ్రి వెంకటరమణ, తల్లి లక్ష్మీదేవి ఆశీస్సులు, సోదరుడు, భర్త ప్రోత్సాహం ఆమెకు తోడు కావడంతో అనుకున్న లక్ష్యాన్ని అవలీలగా ఛేదించింది. అదేవిధంగా గౌతవరం గ్రామానికి చెందిన మరో మహిళ మార్తోట రమాదేవి ఎస్‌ఏ గణితంలో 82మార్కులు సాధించగా మార్తోట రమేష్ (రిటైర్డ్ ఆర్మీ) అను వ్యక్తి ఎస్‌ఏ పీడీ విభాగంలో 86మార్కులు సాధించి జిల్లా స్థాయిలో 7వ ర్యాంకు దక్కించుకున్నారు. వీరు కాక మండలంలో మరికొందరు కూడా మంచి ఫలితాలు సాధించారని 1:1నిష్పత్తిలో నేడు ఒంగోలులో సర్టిఫికెట్లు పరిశీలనకు వీరు హాజరవుతున్నారు. జిల్లా స్థాయిలో రెండవ ర్యాంకు సాధించిన భూలక్ష్మిని ఉపాధ్యాయులు టీవీ కృష్ణయ్య, బీ గణేష్, ఎం.శ్రీనివాసులు, గౌతవరం గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు.

కంభం వాసికి మూడు పోస్టులు


మంజు

కంభం : కంభం మండలం కంభం పంచాయతీ ఎల్‌వీఎస్ నగర్‌లో ఉంటున్న పొట్లపాటి మంజు మొదటి ప్రయత్నంలోనే మూడు డీఎస్సి టీచర్ పోస్టులు సాధించడంపట్ల పలువురు మంజును అభినందించారు. టీజీటీ సైన్స్‌లో 69.67 మార్కులతో 6వ ర్యాంకు, పీజీటీ సైన్స్‌లో 75.66 మార్కులతో 20వ ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ బయోలాజికల్ సైన్స్‌లో 81.71మార్కులతో 18వ ర్యాంక్ సాధించారు. పొట్లపాటి మంజు తల్లిదండ్రులైన సైమన్ పీటర్ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తూ రిటైర్డ్ కాగా, తల్లి ఎలమందమ్మ ఫారెస్ట్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు.

భాస్కర్‌కు జిల్లా స్థాయిలో రెండో ర్యాంక్


భాస్కర్

పెద్ద దోర్నాల : విద్యతోనే వ్యక్తి అభివృద్ధి సాధ్యమని నమ్మి కూలి పనులు చేసుకుంటూ తన కుమారిడిని బీఈడీ చదివించారు. ఆ తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెడుతూ డీఎస్సీ పరీక్ష ల్లో జిల్లా స్థాయిలో రెండవ ర్యాంకు సాధించారు మండలంలో ని తిమ్మాపురం గ్రామానికి చెందిన గోవిందు భాస్కర్. అతడు ఒకటవ తరగతి నుంచి పది, ఇంటర్ దోర్నాల పాఠశాల, కాలేజీలో చదువుకున్నారు. మార్కాపురంలోని ఎస్‌వీకేపీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం 2008-09 బీఈడీ చేశారు. ప్రభుత్వం పోస్టులు మంజూరు చేయక పోవడంతో ఒంగోలులోని ప్రైవేటు పాఠశాలల్లో బోధిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెప్పినట్లుగా మెగా డీఎస్సీలో సోషల్ అసిస్టెంట్ విభాగంలో జిల్లా స్థాయిలో 83.624 మార్కులతో భాస్కర్ రెండో ర్యాంక్ సాధించారు. తిమ్మాపురం గ్రామానికి చెందిన గోవిందు బాలయ్య, నందమ్మకు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు. బాలయ్య బేల్దారి కూలి, భార్య నందమ్మ వ్యవసాయ కూలి.

కోట సత్యమాంబ దేవికి పూజలు

కంభం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : కంభంలో వెలసిన సర్వమతాల ఆరాధ్యదైవం కోట సత్యమాంబదేవికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ మొక్కులు చెల్లించుకున్నారు. పండుగల సమయంలో, అలాగే ప్రతి ఆదివారం కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు మండలాలకు చెందిన వందలాది మంది భక్తులు అమ్మవారికి బోనాలు నైవేద్యంగా సమర్పిస్తారు. తమ కోరికలు తీరిన భక్తులు పెద్ద ఎత్తున కోళ్ళు, పొట్టేళ్ళు అమ్మవారికి సమర్పిస్తారు. నూతన వాహనాలు కొనుగోలు చేసిన భక్తులు దేవాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. భక్తులు కుంకుమ బండ్లతో మొక్కు తీర్చుకున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

రాచర్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గిద్దలూరు రూరల్ సీఐ జె రామకోటయ్య అన్నారు. మండలంలోని రామాపురం దళిత కాలనీలో శనివారం రాత్రి ఆయన సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వివిధ రకాల ఫోన్ నెంబర్లతో నేరగాళ్లు మన సమాచారాన్ని అడుగుతారని, అలాంటి నెంబర్ల గురించి తెలుసుకోకుండా మన సమాచారం ఇవ్వకూడదని అన్నారు. ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్న వయసులోనే పెళ్లిళ్లు, ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్ యాప్‌లు, మాధకద్రవ్యాలు ఇలాంటి వాటిపై దృష్టి సారిస్తున్నారని వాటి ద్వారా చదువు, ఆరోగ్యం, భవిష్యత్ దెబ్బతింటుందన్నారు. సెల్ ఫోన్‌ల ద్వారా యువత చెడుత్రోవ పడుతున్నారని, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గ్రహించాలని సూచించారు. కార్యక్రమంలో రాచర్ల ఎస్సై పి కోటేశ్వరరావు, ఏఎస్సై వై ఆదిశేషయ్య, పోలీస్ సిబ్బంది, స్వచ్చంధ సేవాసంస్థ ప్రతినిధి ఇల్లూరి ప్రేమ్ కుమార్, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.


విద్యుత్ దీపాలతో ముస్తాబైన మార్కెట్ యార్డ్

నేడు ఏఎంసీ చైర్మన్ ప్రమాణ స్వీకారం

హాజరు కానున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు

మార్కాపురం రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం సోమవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, డోలాశ్రీబాలవీరాంజనేయస్వామి, ఆనం రామనారాయణరెడ్డి, బీసీ జనార్దన్, ఎంపీ మాగుంటతోపాటు ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జిలు, నాయకులు హాజరవుతున్నట్లు ఏఎంసీ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి తెలిపారు.

నవోదయ ప్రవేశాలకు గడువు పొడిగింపు

తర్లుపాడు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : నవోదయలో 6వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 27వ తేదీ వరకు గడువు పొడగించినట్లు ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి ఆదివారం తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 9వ, 11వ తరగతి ప్రవేశానికి సెప్టెంబర్ 23వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి ఈ ఖాళీలను పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

146 మందికి పరీక్షలు

గిద్దలూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యసాయి బస్ షెల్టర్‌లో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉచిత షుగర్, బీపీ పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. 146 మందికి పరీక్షలు చేశారు. రోజూ వ్యాయామం, మితాహారం, ఆకుకూరలను ఎక్కువగా వాడడం, నడక తదితర సూత్రాలు పాటిస్తే బీపీ, షుగర్‌తో వ్యాధులు రాకుండా ఆరోగ్యంగా ఉండవచ్చని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు రాచపూటి నరసింహారావు సూరె నాగేశ్వరరావు, ఆరవీటి చంద్రశేఖర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ గర్రె పుల్లయ్య, పాల్గొన్నారు.

ఎన్టీఆర్ పోలికలతో శ్రీకృష్ణుని విగ్రహం తగదు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీ రామారావు పోలికలతో శ్రీ కృష్ణుని విగ్రహాన్ని తయారు చేయడం తగదని బీసీ సంఘ నాయకులు అన్నారు. స్థానిక బీసీ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ సంఘ నాయకులు బి.లక్ష్మీ ప్రసాద్, చిన్నయ్య మాట్లాడుతూ.. గుంటూరు జిల్లా తక్కెళ్లపాడులో కొంతమంది అవగాహన లేకుండా వివిధ సంఘాల రాజకీయ నాయకులు వద్దని వారించినా ఎన్టీఆర్ పోలికలతో కృష్ణుని విగ్రహాన్ని తయారు చేశారన్నారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అందరికీ ఆనందమే అయినా దేవుడి విగ్రహంగా ఎన్టీఆర్ విగ్రహాన్ని తయారు చేయడం సరికాదన్నారు. రజక సంఘం సుబ్బు, సూరె బలిజ నాయకులు పురుషోత్తం, నాయీ బ్రాహ్మణ, వడ్డెర సంఘం నాయకులు, కాటంరాజు దేవస్థాన కమిటీ ప్రధాన కార్యదర్శి చిన్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాచర్ల ఏఎస్సై బదిలీ

రాచర్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల ఏఎస్సై ఏకసిరి ఆదిశేషయ్య ఒంగోలు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. పోలీసు ఉన్నతాధికారుల నుండి ఆయనకు బదిలీ ఉత్తర్వులు కూడా అందాయి. 5సంవత్సరాలు ఒకే చోట పనిచేసిన సిబ్బందిని ప్రభుత్వం సాధారణంగా బదిలీ చేస్తుంది. అందులో భాగంగానే ఈ బదిలీ జరిగింది. రాచర్ల ఏఎస్సైగా ఎర్రగొండపాలెంలో పనిచేస్తున్న వై.శ్రీనివాసులు రానున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

రేపటి వరకు దరఖాస్తుల స్వీకరణ

గిద్దలూరు టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : బార్ లైసెన్సు కోసం దరఖాస్తులు చేసుకునే వారు ఈనెల 26వ తేదీ సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రకాశం, బాపట్ల జిల్లాల ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కె.హేమంత్ నాగరాజు అన్నారు. ఆదివారం గిద్దలూరులోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో బార్ లైసెన్సు అభ్యర్థులు పాత ఏ4 షాపు లైసెన్సు హోల్డర్లు, రెస్టారెంట్ యజమానులు, డాబా యజమానులు, ప్రస్తుత ఏ4 షాపు లైసెన్సు హోల్డర్లతో సమావేశం నిర్వహించారు.

ఘనంగా విగ్నేష్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుమారుడు విగ్నేష్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గడియార స్తంభం సెంటర్‌లో నాయకులు కందుల రామిరెడ్డి కేక్ కట్ చేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు. స్ఫూర్తి వెల్ఫేర్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో కందుల వసంత లక్ష్మి అల్పాహారాన్ని అందించారు.

గణేష్ విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

దర్శి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసుకునే భక్తులు తప్పనిసరిగా పోలీసు అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ ఎం.మురళీ సూచించారు. విగ్రహాలు ఏర్పాటుచేసేవారు కమిటీగా ఏర్పడి సమాచారాన్ని తమకు తెలపాలన్నారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎవరైనా అల్లర్లు, గొడవలకు పాల్పడి శాంతి భద్రతకలు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సత్సంగాన్ని మించిన సాధన లేదు!

కనిగిరి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సత్సంగాన్ని మించిన సాధన మరొకటి లేదని మాజీ మంత్రులు ముక్కు కాశిరెడ్డి, మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. సత్సంగం ప్రాధాన్యతపై విస్తృత ప్రచారం జరగాలన్నారు. స్థానిక సాయిబాబా మందిరంలో ఆదివారం శ్రీసద్గురు సాయి సేవా సమితి, శ్రీ షిరిడి సాయిబాబా దేవాస్థానం సంయుక్తంగా నిర్వహించిన సత్సంగ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో అనిల్‌కుమార్, సాయివాహిని, కొప్పరపు సత్యాలు, దేవకి సుబ్రహ్మణ్యం, దేవకి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు పోలీసుస్టేషన్ ఆకస్మిక తనిఖీ

తాళ్లూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): తాళ్లూరు పోలీస్ స్టేషన్‌ను దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ ఆదివారంరాత్రి ఆకస్మికంగా తనిఖీచేశారు. స్టేషన్‌లోని రికార్డులను, కేసుల పురోగతిని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వినాయక చవితి పండుగ, గణేశ నిమజ్జనాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. ఉత్సవాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ మల్లికార్జునరావు, ఏఎస్ఐలు మోహనరావు, భాస్కర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు

వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలి

ముండ్లమూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ కె.కమలాకర్ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని మారెళ్ళ, సుంకరవారిపాలెం, నూజెండ్లపల్లి, పూరిమెట్ల, భీమవరం, ఈదర, ఉమామహేశ్వర అగ్రహారం, పెదరావిపాడు, గ్రామాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక విగ్రహాలు ఏర్పాటుచేసేవారు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

» డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్

వీసీపల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్ర ణపై ప్రత్యేక దృష్టి సారించాలని కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేసి నమోదైన కేసుల వివరాలు, ప్రస్తుత స్థితిగతులపై ఎస్ఐ కోటయ్యను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని ఆదేశించారు. పెండిగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో గస్తీని పెంచాలని ఆదేశించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. వినాయకచవితి సందర్భంగా నిమజ్జన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దష్టి సారించాలన్నారు. ముందుగానే నిమజ్జన ప్రాంతాలను గుర్తించి కమిటీ మెంబర్లకు తగు సూచనలు చేయాలన్నారు. తరచుగా పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కల్పించాలన్నారు. మత్తు పదార్థాలను సేవించడంవల్ల కలిగే దుష్ప్రభావాల గురించి తెలియజేయాలన్నారు. ఆయన వెంట కనిగిరి సీఐ షేక్ ఖాజావలి ఉన్నారు.



స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న సాయిఈశ్వర్ యశ్వంత్

పేద కుటుంబాల్లో వెల్లివిరిసిన ఆనందం

» ఉపాధ్యాయ పోస్టులకు పలువురు ఎంపిక

ముండ్లమూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పేదింటి బిడ్డలు ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. మెగా డీఎస్సీ 2025కు సంబంధించి శనివారం సాయంత్రం మెరిట్ జాబితా విడుదలైంది. మండలంలోని పలు గ్రామాలకు చెందినవారు ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. వీరిలో కొందరు నిరుపేద కుటుంబానికి చెందిన వారుకాగా, మరికొందరు మధ్య తరగతి కుటుంబానికి చెందినవారు. తల్లిదండ్రుల కష్టం చూసి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని కష్టపడి అనుకున్న లక్ష్యాన్ని సాధించారు.

ఉపాధ్యాయురాలిని కావాలనే ఆశయం

- నంబూరి చర్మిష, పోలవరం



చిన్నతనం నుంచే ఉపాధ్యాయురాలిని కావాలనే కోరిక బలంగా ఉండేది. ఇంటర్ తరువాత టీటీసీ పూర్తి చేశాను. డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడిన దగ్గర నుంచి కష్టపడి చదివాను. మెరిట్ జాబితాలో 87.4 శాతం మార్కులు సాధించాను. తల్లిదండ్రులు పడ్డ కష్టాన్ని చూసి చలించి కష్టపడి చదివించి ఉద్యోగం సాధించాను.

కష్టానికి ఫలితం దక్కింది

- కందుల విక్టర్‌పాల్, పోలవరం



తన తల్లిదండ్రులు పనులకు వెళ్ళి చదివించారు. బీఈడీ పూర్తిచేసిన తరువాత గత ఆరేళ్లుగా టీచర్ పోస్టు కోసం ఎదురు చూశాను. ఎటువంటి కోచింగ్ లేకుండా ఇంటి దగ్గరే ఉండి చదువుకున్నాను. నా కష్టానికి ఫలితం దక్కింది. మెరిట్ జాబితాలో 77 మార్కులు సాధించాను. ఎస్సీ కోటాలో బయాజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా ఎంపిక కాబోతున్నాను.

తల్లిదండ్రుల కష్టాన్ని చూడలేక..

- చిలకల సాంబశివారెడ్డి, లక్ష్మీనగర్



సెంటు భూమిలేని నిరుపేదలైన తన తల్లిదండ్రులు కష్టపడి చదివించారు. వృద్ధాప్యంలో వారిని ఆదుకోవాలనే లక్ష్యంతో గత ఆరేళ్లుగా కష్టపడి చదివాను. స్కూల్ అసిస్టెంట్ గణితం పోస్టుకు ఓపెన్ క్యాటగిరిలో నాల్గవ ర్యాంకు సాధించాను. మెరిట్ జాబితాలో 86.71 మార్కులు వచ్చాయి. దీని వెనుక నా తల్లిదండ్రుల కష్టం ఎంతో ఉంది.

భర్త ప్రోత్సాహంతో..

- నంబూరి జ్యోతి, శంకరాపురం



భర్త ప్రోత్సహంతో ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికయ్యా. తన భర్త ఏసుబాబు ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రత్యేకంగా ఉపాధ్యాయ కోచింగ్ ఇప్పించి నన్ను ప్రోత్సహించటం వల్ల ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికయ్యాను. 11 నెలల బిడ్డను ఒడిలో పెట్టుకొని చదివాను. పీడీ పోస్టును సాధించాను.

భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండ లంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానం లో ఆదివారం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవస్థాన అర్చకులు స్వామివారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. మేళ తాళాలతో దేవస్థాన గాలి గోపురం నుంచి మహానైవేద్యాన్ని ఆలయ ప్రదక్షిణ చేసి స్వామివారికి సమర్పించారు. గోశాలలో గల గోమాతలకు పసుపు, కుం కుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదా నం నిర్వహించారు.

కార్యక్రమంలో దేవస్థాన అధ్యక్షుడు కొమ్మినేని చిన్నఆది నారాయణ, ఈవో నరసింహబాబు, చావా సుబ్బయ్య, సంగిశెట్టి పీరయ్య నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివార్ల పొంగళ్లు

ముండ్లమూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయుడుపాలెం గ్రామంలో సీతారామ లక్ష్మణ స్వామి ఆలయాన్ని ప్రతిష్ఠించిన సందర్భంగా ఆదివారం భక్తులు నెల పొంగళ్ళు నిర్వహించారు. నైవేద్యాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి దేవతామూర్తులకు సమర్పించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ప్రధాన అర్చకులు దుర్భాకుల నగేష్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

నేడు సొసైటీ అధ్యక్షుడిగా రమణారెడ్డి బాధ్యతల స్వీకరణ

తాళ్లూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మన్నేపల్లి సొసైటీ అధ్యక్షులుగా గొంది రమణారెడ్డి (సమర) సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. టీడీపీలో క్రియాశీలకంగా ఉండి పార్టీ అభ్యున్నతికి కృషిచేస్తున్న రమణారెడ్డి ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్‌ల సహకారంతో మన్నేపల్లి సొసైటీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. పార్టీ శ్రేణుల సమక్షంలో సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈకార్యక్రమంలో పీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ సీతారామయ్య, తదితరులు రానున్నట్టు రమణారెడ్డి తెలిపారు.

ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవాలి

కనిగిరి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని మున్సిపల్ ఛైర్మన్ గఫార్ అన్నారు. ఆదివా రం పట్టణంలోని శివనగర్ కాలనీలో ఉన్న బీసీ బాలికల హాస్టల్‌ను ఆయన పరిశీలించారు. ఇది వినియోగంలో లేకపోవటంతో పాడుబడి దుర్వాసన వస్తుందని స్థానికులు ఛైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. హాస్టల్‌లోని నాలుగు గదులను ఆయన పరిశీలించారు. హాస్టల్ స్థితిగతులపై ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ద్వారా సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి ఈ భవనాన్ని వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. మున్సిపల్ పారిశుధ్య సిబ్బందితో హాస్టల్‌ను శుభ్రం చేయిస్తామని స్థానికులకు ఛైర్మన్ హామీ ఇచ్చారు.

రాజంపల్లిలో విజిలెన్స్ తనిఖీలు


రాజంపల్లిలోని దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

దర్శి ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజంపల్లిలో ఆదివారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.శివనాగప్రసాద్, ఏవో కె.రాధ, సీఐ ఎన్.రాఘవరావు రాజంపల్లిలోని ఓదుకాణంలో బిల్లులు లేకుండా విక్రయిస్తున్న 128 బస్తాల యూరియాను పట్టుకున్నారు. అలాగే, లైసెన్స్‌లేని 265 బస్తాల వివిధ రకాల విత్తనాలను సీజ్ చేశారు. దుకాణ యజమానిపై 6ఏ కేసు నమోదు చేశారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఉపాధ్యాయుడి ఎంపిక

పీసీపల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి యోగా పోటీలకు ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎంపికయ్యాడు. మండలంలోని వెంగళాయపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న స్వర్ణ రమణయ్య యోగా పోటీలలో ప్రతిభ కనబరుస్తున్నారు. ఈనెల 21 నుండి 24వరకు పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ఆయన పాల్గొన్నారు. హ్యాండ్‌బ్యాలెన్స్ ఆసనం, సుపైన్ ఆసనాలు వేసి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. దీంతో నిర్వాహకులు ఉపాధ్యాయుడు రమణయ్యను జాతీయస్థాయి పోటీలకు ఎంపికచేశారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన రమణయ్యకు పతంజలి యోగాపీఠం అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, మండల విద్యాశాఖాధికారులు జి.సంజీవి, ఆర్.శ్రీనివాసులు అభినందనలు లిపారు.

బండ్లదారి ఆక్రమణ


అక్రమ నిర్మాణాలను అడ్డుకున్న ఆర్ఐ సుధాకర్, రెవెన్యూ సిబ్బంది

కనిగిరి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): బండ్లదారిని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఈఘటన ఆదివారం మండలంలోని బల్లిపల్లి అడ్డరోడ్డు వద్ద చోటుచేసుకుంది. సర్వేనెం 66, 67లో 30 సెంట్లు విస్తీర్ణంలో బండ్లదారి ఉంది. ఈదారి గుండానే అవతలివైపు పొలాల్లోకి వెళ్ళాల్సి ఉంది. బల్లిపల్లి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఆ భూమిపై కన్నేశాడు. సదరు భూమిని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతుండగా స్థానికులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ రవిశంకర్ ఆదేశాల మేరకు ఆర్ఐ సుధాకర్ సిబ్బందితో వెళ్ళి అక్రమ కట్టడాన్ని అడ్డుకున్నారు. ఈసంఘటనపై తహసీల్దార్, ఆర్ఐలను వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. సోమవారం ఆస్థలాన్ని పరిశీలించి అక్రమ నిర్మాణదారుడిపై చట్టపరమైన చర్యలకు ఉపక్రమించనున్నట్లు తెలిపారు.



గుప్త నిధుల తవ్వకాలపై..

కదులుతున్న డొంక

» సూత్రధారి కోసం గాలింపు
» పోలీసుల అదుపులో ముఠా

కనిగిరి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గుప్త నిధుల కోసం తవ్వకాలపై పోలీసుల విచారణలో విస్తుపోయే అంశాలు వెలుగుచూస్తున్నాయి. హనుమంతునిపాడు మండలం నందనవనం గ్రామ కొండపై ఉన్న రంగనాయకస్వామి ఆలయంలో ఈనెల 21 కొంతమంది గుప్త నిధుల కోసం తవ్వకాలు చేస్తుండగా గ్రామస్థులు ఒకరిని పట్టుకొన్నారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రధాన సూత్రధారితో పాటు ముఠాలోని వ్యక్తులను పట్టుకునేందుకు డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్ ఆధ్వర్యంలో సీఐ ఖాజావలి నేతృత్వంలో పోలీసులు బృందాలుగా విడిపోయి ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. వీరిని కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

కదులుతున్న డొంక

పట్టణంలో పేరుమోసిన రాజకీయ నాయకుడైన సూత్రధారి ఇదే ప్రధాన వృతిగా ఎంచుకుని గుప్తనిధుల కోసం తవ్వకాలను చేస్తున్నట్లుగా తెలుస్తుంది. మారుమూల ప్రాంతాల్లోని పురాతన చరిత్ర గల్గిన దేవాలయాలను ఎంచుకుని ఆప్రాంతంలో కొద్దిరోజులు వివిధ రకాల కారణాలతో సంచరిస్తాడని సమాచారం. దేవాలయం గర్భగుడిలో ఉండే రాతి విగ్రహాల కింద ఉన్న గుప్త నిధి కోసం తవ్వకాలను పక్కా ప్లాన్‌గా రెక్కీవేసి తవ్వకాలు చేస్తున్నట్లు పోలీసులు సమాచారాన్ని సేకరించినట్టు సమాచారం. దేవాలయాల వద్దకు వెళ్లేక్రమంలో అవాంతరాలు ఏర్పడకుండా గ్రామంలోని కొంతమంది వ్యక్తులను మచ్చిక చేసుకుని రంగంలోకి దిగుతున్నట్టు సమాచారం. పూజా కార్యక్రమాలు నిర్వహించే క్రమంలో ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా దాదాపు 30 మంది వ్యక్తులు ప్రత్యేకంగా గస్తీ చేస్తారని తెలుస్తుంది. పకడ్బందీగా తవ్వకాలు చేస్తున్నా ఏవైనా అలజడులు రేగితే తప్పించుకునేందుకు ముందుగానే ప్రణాళిక రచించుకుంటారని పోలీసులు ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం. గుప్తనిధుల తవ్వకాలకు పాల్పడినవారిలో తొలుత 15 మందిగా పోలీసులు ప్రాథమిక విచారణలో అంచనాకు వచ్చారు. అయితే, ఒక్కొక్కరిని అదుపులోకి తీసుకుని విచారణచేస్తుండగా ముఠా సంఖ్య పెరుగుతున్నట్టు సమాచారం.


రంగనాయకస్వామి ఆలయ గర్భగుడి వెనుకభాగం తవ్విన ముఠా

బెడిసికొట్టిన పథక రచన

సూత్రధారిగా భావిస్తున్న వ్యక్తి కొద్ది రోజుల క్రితం నందనవనంలో బంగారు వస్తువులను ఆ గ్రామంలోని కొంతమందికి చూపించారు. తనకు కేజీ బంగారం తవ్వకాల్లో దొరికిందని, మీరూ సహకరిస్తే సగభాగం పంచుతానని ఆశ చూపించినట్లు తెలుస్తుంది. గ్రామంలో మచ్చిక చేసుకునే క్రమంలో ఓ వ్యక్తిని సంప్రదించిన సూత్రధారి బోల్తా పడ్డాడు. సదరు వ్యక్తి గ్రామంలోని కొంతమంది నమ్మకస్థులకు విషయాన్ని చేరవేశాడు. సూత్రధారికి రాజకీయ పలుకుబడితో తప్పించుకుంటాడని భావించిన గ్రామస్థులు ఎలాంటి అనుమానం రాకుండా గుప్తనిధుల కోసం తవ్వకాలు చేసేముందు జరిగే పూజా తంతుకు ముందే ముఠాలోని ఓ వ్యక్తిని వెంబడించి పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ముఠా మేస్త్రీకి నందనవనం గ్రామంలో ప్లాన్ తిరగబడింది.

నిందితుల నుంచి విచారణ చేపట్టిన పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఇప్పటికే పోలీసుల అదుపులో పదిమందికిపైగా ఉన్నారు. త్వరలో సూత్రదారిని కూడా పోలీసులు అరెస్ట్ చేయనున్నట్టు సమాచారం.

నిరుపయోగంగా కియోస్ యంత్రాలు

» రైతులకు ఒనగూరని ప్రయోజనం
» అవగాహన కల్పనలో అధికారుల వైఫల్యం

పామూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకంతో కోట్ల రూపాయల ప్రజా ధనం దుర్వినియోగమైంది. వ్యవసాయ సిబ్బంది సహకారంతో రైతులు తమకు అవసరమైన ఎరువులు పురుగు మందులు విత్తనాలను కియోస్ యంత్రాల ద్వారా నమోదు చేసుకోవచ్చు. ఆతరువాత నేరుగా రైతుల ఇంటికే వాటిని సరఫరా చేస్తారు. మార్కెట్‌లో పంటల ధరలు, వాతావరణం మార్పులు, తదితర విషయాలను రైతులు తెలుసుకొనే సౌలభ్యమూ ఉంటుంది. రైతుసేవా కేంద్రాల్లో గత ప్రభుత్వం యంత్రా లను ఏర్పాటుచేసిందే తప్ప రైతులకు అవగాహన కల్పించలేదు. దీంతో వీటిని వినియోగించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఒక్కో యంత్రానికి సుమారు రూ.67 వేలు ఖర్చుచేశారు. కొన్నిచోట్ల రైతు సేవా కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో వీటిని పంచాయతి కార్యాలయాల్లో ఉంచారు. చాలా కేంద్రాల్లో ఇంటర్నెట్ సౌకర్యం కల్పించకపోవడంతో ఇవి మూలకు చేరాయి. నాటి వైసీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలుగా నామకరణం చేస్తే నేటి కూటమి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చింది.

ఇప్పటికైనా పాలకులు, వ్యవసాయశాఖ జిల్లా ఉన్నాతాధికారులు స్పందించి కియోస్ యంత్రాలను వినియోగంలోకి తేవాలని రైతులు కోరుతున్నారు.


రైతుసేవా కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న కియోస్ యంత్రం



స్మార్ట్ కార్డులకు.. ముహూర్తం ఖరారు

- ఎక్కడికక్కడ పంపిణీకి అధికారుల ఏర్పాట్లు
- రెండో దశలో గుంటూరు జిల్లాలో 30 నుంచి
- నాలుగో దశలో పల్నాడు, బాపట్లలో వచ్చే నెల 15..

బాపట్ల, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ అధికార చిహ్నం, కుటుంబ పెద్ద ఫొటో, కార్డు నెంబరు, షాపు ఐడీ నెంబరు, క్యూఆర్ కోడ్, కుటుంబసభ్యుల వివరాలుతో ఏటీఎం తరహాలో రూపొందించిన రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఖరారైంది. ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత తీసుకు రావడంలో భాగంగా స్మార్ట్ కార్డులను కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను డీలర్ల వద్ద ఉన్న ఈ పోసు యంత్రంతో స్కాన్ చేస్తే లబ్ధిదారుల వివరాలతో పాటు, సరుకుల వినియోగ సమాచారం కూడా తెలుసుకోవచ్చు. ఇలా సరికొత్త టెక్నాలజీతో రూపొందించిన స్మార్ట్ కార్డులను అందుకునేందుకు కార్డుదారులు కూడా ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో స్మార్ట్‌కార్డుల పంపిణీని రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు దశల్లో చేపడుతుండగా గుంటూరు జిల్లాలో రెండో దశలో ఈ నెల 30న ప్రారంభించేందుకు ప్రభుత్వం షెడ్యూల్ ఇచ్చింది. దీంతో జిల్లాలో 5.85 లక్షల మందికి స్మార్ట్ కార్డులు అందించేందుకు పౌర సరఫరాల శాఖ అధికారులు కసరత్తు పూర్తి చేశారు. పౌర సరఫరాల మంత్రి మనోహర్ కార్డుల పంపిణీని ప్రారంభిస్తారని సమాచారం. అయితే 30వ తేదీ వరకు మంత్రి షెడ్యూల్ బిజీగా ఉంది. ఈ నేపథ్యంలో ఈనెల 31 నుంచి జిల్లాలో కార్డుల పంపిణీ ప్రారంభం అయ్యే అవకాశం కనిపిస్తోంది. కాగా నాలుగో దశలో పల్నాడు, బాపట్ల జిల్లాల్లో స్మార్ట్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం షెడ్యూల్ ఇచ్చింది. దీంతో పల్నాడులో 6,39,282 మందికి, బాపట్ల జిల్లాలో 4.58 లక్షల మందికి స్మార్ట్ కార్డులను అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

కొత్త కార్డుల పంపిణీపై సందిగ్ధం

స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీలో కొత్త కార్డుల జారీపై సందిగ్ధం నెలకొంది. ప్రస్తుతం గుంటూరు జిల్లాలో 5,99,558 రైస్ కార్డులు ఉండగా ప్రభుత్వం 5,85,000 స్మార్ట్ రైస్ కార్డులను అందజేసేందుకు సిద్ధం చేసింది. దీనినిబట్టి కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారికి రైస్ కార్డుల జారీ కష్టమనే తెలుస్తోంది. ఇదే పరిస్థితి పల్నాడు, బాపట్ల జిల్లాల్లోనూ నెలకొన్నట్లు సమాచారం.

మూడు దశల్లో యాక్టివేట్..

మొదటి రెండు దశల్లో యాక్టివేట్ ప్రక్రియ అనంతరం స్మార్ట్‌కార్డులను రేషన్ డీలర్, సచివాలయ సిబ్బంది కలిసి లబ్ధిదారుకు అందజేస్తారు. ఆ తర్వాత మూడో దశలో ఈ-పోస్ యంత్రంలో కార్డును యాక్టివేట్ చేసుకోవాలి. ఈ దశలో కార్డుపై ఉండే క్యూఆర్ కోడ్‌ను ఈ పోస్ మిషన్ ద్వారా స్కాన్ చేసి కార్డు యజమానితో ప్రామాణీకరించాలి. అప్పుడు మాత్రమే కార్డు యాక్టివేట్ అవుతుంది. ఇలా మూడు దశల్లో కార్డును యాక్టివేట్ చేసుకోవడం ద్వారా ఈ కార్డు అత్యంత భద్రమైనదని ప్రభుత్వం చెబుతోంది.



కొమ్మమూరు కాలువలో ఆయిల్ ఇంజన్‌తో నీటి సరఫరా

కొమ్మమూరులో తగ్గిన నీరు

ఇంజన్లతో నారుమళ్లకు నీటి సరఫరా

కారంచేడు(పర్చూరు), ఆగస్టు 24: కొమ్మమూరు కాల్వలో నీటి పరిమాణం తగ్గింది. దీంతో నారుమడులకు నీరు అందక రైతులు అవస్థలు పడుతున్నారు. చేసేది లేక ఆర్థిక భారం అయినా ఆయిల్ ఇంజన్లను ఏర్పాటు చేసుకుని నారుమడులకు నీటిని సరఫరా చేసుకుంటున్నారు. కాల్వలో ప్రస్తుతం రీడింగ్ ఐదు అడుగులకే పరిమితమైంది. ఆరు అడుగుల పైబడి ఉంటేనే పైర్లకు నీరు అందుతుందని రైతులు అంటున్నారు. స్వర్ణ, కుంకలమర్రు, కారంచేడు తదితర గ్రామాల పరిధిలో నారుమడులను రైతులు సాగు చేస్తున్నారు. కొమ్మమూరు కాల్వ పరిధిలో ఉన్న మెట్ట భూముల్లో కూడా వరిని సాగు చేసుకోవాలన్న ఆలోచనలో రైతులు ఉన్నారు. ఈ నేపథ్యంలో కొమ్మమూరు కాల్వలో నీటి పరిమాణం తగ్గడంతో రైతుల్లో నైరాశ్యం నెలకొంది. కాల్వలో నీటి పరిమాణం పెంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



కారంచేడు వద్ద నీటి పరిమాణం

అధ్యక్ష పీఠంపై ఎవరో



- మూడు పేర్లతో అధిష్ఠానానికి నివేదిక
- నేడు బాపట్ల టీడీపీ కార్యాలయంలో సమావేశం
- బాపట్ల పార్లమెంట్ టీడీపీ అధ్యక్ష పదవిపై కసరత్తు
- శాసనమండలి చీఫ్ విప్ అనురాధ ఆధ్వర్యంలో త్రిసభ్య కమిటీ రాక



బాపట్లలోని టీడీపీ కార్యాలయం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

నామినేటెడ్ పదవుల భర్తీని ఓ కొలిక్కి తెచ్చిన టీడీపీ అధిష్ఠానం పార్టీ పదవులపై దృష్టి సారించింది. బాపట్ల పార్లమెంట్ స్థానానికి పార్టీ అధ్యక్షుడి నియామకంపై నేతలు కసరత్తు ప్రారంభించారు. ఈ క్రమంలో శాసన మండలి చీఫ్ విప్ అనురాధ నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ సోమవారం బాపట్లకు రానుంది. స్థానిక టీడీపీ కార్యాలయం వేదికగా అధ్యక్ష పీఠంపై అభిప్రాయ సేకరణ జరపనుంది. బాపట్ల పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో పాటు ఇప్పటికే నామినేటెడ్ పదవులు పొందిన వారు, మండల స్థాయి నేతలు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. అధ్యక్ష పీఠంపై నేతల నుంచి అభిప్రాయ సేకరణ జరపనున్నారు. పార్లమెంట్ సారథ్య పీఠంతో పాటు 14 అనుబంధ సంఘాలకు సంబంధించి పదవుల ఎంపికపై కసరత్తు జరగనుంది. సమావేశంలో వ్యక్తమైన అభిప్రాయాలను క్రోడీకరించి ముగ్గురి పేర్లను తుది పరిశీలనలో పెట్టేవిధంగా త్రిసభ్యకమిటీ అధిష్ఠానానికి నివేదిక అందించనుంది. దీని ఆధారంగానే పార్టీ (మిగతా 8వ పేజీలో)

ఆ ముగ్గురు ఎవరో..

బాపట్ల పార్లమెంట్ స్థానం అధ్యక్షుడి ఎంపికలో సామాజిక సమీకరణాలతో పాటు ఆయా నియోజకవర్గాల నేతల ఏకాభిప్రాయం, కార్యకర్తల అంగీకారం కీలకంగా ఉండనున్నాయి. కానీ ఈ పీఠాన్ని తమ నియోజకవర్గాల పరిధిలోని నేతలకు ఇప్పించుకోవడానికి ఇప్పటికే ఎవరిశైలిలో వారు పావులు కదుపుతున్నట్లు సమాచారం. జిల్లా కేంద్రమైన బాపట్లతో పాటు ఇతర నియోజకవర్గాల నుంచి పలువురు అధ్యక్ష పీఠంపై ఆశలు పెట్టుకుని నేతల వైపు నుంచి ఒత్తిడి తెస్తున్నారు. సోమవారం నాటి సమావేశంలోనే ముగ్గురి పేర్లను అధ్యక్ష పదవికి పరిశీలనలోకి తీసుకోనున్నారు.

- గణేశ్ ఉత్సవ కమిటీల నుంచి దోపిడీ
- పేరుకే ఆన్‌లైన్ సింగిల్ విండో విధానం
- ఫోన్లు చేసి పిలిపించుకుని శాఖలవారీగా వసూళ్లు
- ఆన్‌లైన్‌లో చేస్తే సరిపోదు.. కలవాల్సిందేనని హుకుం



అడిగినంత ఇస్తేనే.. అనుమతి

(తెనాలి - ఆంధ్రజ్యోతి)

పోలీస్: మీరు గణేశుని మండపం పెట్టుకునేందుకు అనుమతికి దరఖాస్తు చేసుకున్నారు కదా! ఒకసారి స్టేషన్‌కు వచ్చి కలవండి.

కమిటీ: ఆన్‌లైన్‌లో చేస్తే సరిపోతుందన్నారు కదా! మళ్లీ కలవడం ఎందుకు.

పోలీస్: ఆన్‌లైన్‌లో చేస్తే సరిపోదు.అఫిడవిట్ మేమెల్లి తెచ్చుకోవాలా? వెంటనే వచ్చి కలిస్తే సరి.. లేకుంటే మీ ఇష్టం.

ఫైర్: హలో.. మేము అగ్నిమాపక కేంద్రం నుంచి ఫోన్ చేస్తున్నాం. ఫైల్ అందింది. వచ్చి తీసుకువెళ్లండి.

కమిటీ: అనుమతి పత్రం ఇస్తారా! తీసుకెళతాం.

ఫైర్: రూ.500 ఇచ్చి తీసుకెళ్లండి.

కమిటీ: అదేంటండీ డీడీ కట్టాం కదా?

ఫైర్: అది కాదు. మాకు ఇవ్వాల్సిన మామూళ్లు ఎవరిస్తారు. పండుగలప్పుడే కదా! మాకూ ఒక రూపాయి వచ్చేది. అవి ఇస్తే మీ కాగితం మీకిస్తాం.

ఇదీ గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని పోలీసు, ఫైర్ అధికారుల తీరు. వినాయక చవితి సమీపిస్తున్న క్రమంలో గణేశ్ ఉత్సవ కమిటీలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. గతంలో మాదిరిగా పోలీసు, ఫైర్, విద్యుత్ శాఖల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్‌లో సింగిల్ విండో విధానంతో తమ కష్టాలు తీరాయని చవితి ఉత్సవ కమిటీలు ఆనందపడ్డాయి. అయితే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే సరిపోదని తమను వచ్చి కలిసి అడిగినంత ఇస్తేనే అనుమతి అంటూ ఆయా శాఖల అధికారులు, సిబ్బంది ఆదేశాలతో గణేష్ ఉత్సవ కమిటీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఎక్కడికక్కడ పోలీస్, ఫైర్, విద్యుత్ శాఖల అధికారులు, సిబ్బంది మామూళ్ల పేరిట పట్టిపీడిస్తున్నారని కమిటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులో ఇచ్చిన ఫోన్ నంబర్‌కు ఫోన్ చేసి మరీ ఆయా అధికారులు పిలిపించుకుని దోచేస్తున్నారు. ఒక్కో మండపానికి అనుమతి తీసుకోవడానికి ప్రభుత్వానికి చెల్లించాల్సిన (మిగతా 8వ పేజీలో)



గణేశ్ విగ్రహ కమిటీల నుంచి తీసుకుంటున్న అఫిడవిట్

అఫిడవిట్ పేరుతో వసూళ్లు

గణేశుని మండపం ఏర్పాటుకు సాధారణంగా పోలీస్ శాఖకు సంబంధించి మైకు అనుమతి కోసం రోజుకు రూ.200 చొప్పున చలానా చెల్లిస్తే సరిపోతుంది. కానీ పోలీసులు అది చాలదంటూ కొత్తగా అఫిడవిట్ సమర్పించాలని షరతులతో వసూళ్ల పర్వానికి తెరలేపారు. ఈ అఫిడవిట్ కూడా స్టేషన్ల పరిధిలో రెండు, మూడు చోట్ల మాత్రమే తయారు చేయించుకొచ్చేలా షరతులు పెట్టారు. అఫిడవిట్‌కు జ్యుడిషియల్ స్టాంప్, ఫీజు చెల్లిస్తే సరిపోతుంది. కానీ వీటికి అదనంగా రూ.1500 నుంచి రూ.2500 వరకు చెల్లించాల్సి వస్తుందని, అంతఎందుకంటే పోలీసులకు ఇవ్వాలని చెప్పడం విశేషం. ఒకవేళ మరొకచోట నుంచి అఫిడవిట్ తీసుకువెళ్లితే దానిని తిప్పి పంపుతున్నారు. లేదంటే బహిరంగంగానే స్టేషనరి, తెల్లకాగితాలు, పెన్నుల వంటివి తీసుకురావాలంటున్నారని ఉత్సవ కమిటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇంతా చెల్లించినా, నిమజ్జనం రోజున కానిస్టేబుల్‌ను పంపిస్తామని, ఎంతమంది వస్తే అంతమందికీ ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున చెల్లించాలని ముందే చెప్పి పంపుతున్నారని కమిటీల సభ్యులు చెబుతున్నారు. ఫైర్ అధికారులకు రూ. 500 చెల్లిస్తేనే అనుమతి పత్రాన్ని ఇస్తున్నారని లేదంటే తిప్పుకుంటున్నారంటున్నారు. విద్యుత్ వినియోగానికి డీడీ కట్టినా లైన్‌మన్లు వసూళ్ల దందా చేస్తున్నారు. మొత్తంమీద ప్రభుత్వం సదుద్దేశంతో సింగిల్ విండో విధానంలో ఆన్‌లైన్ అనుమతికి అవకాశం కల్పిస్తే, అధికారులు దోపిడీ మాత్రం ఆగటం లేదు.

దాడిలో కేసులో ఐదుగురి అరెస్టు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విజయవాడకు చెందిన బంగారు వ్యాపారి రెహమాన్‌పై దాడి, దోపిడీ కేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఎండీ మొయిన్ తెలిపారు. ఆదివారం వేటపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిందితుల వివరాలను ప్రకటించారు. వేటపాలెం లక్ష్మీపురానికి చెందిన మల్లెల రాజేష్‌పై వివిధ జిల్లాల్లో 43, ఆయన భార్య మౌనికపై పలు కేసులు ఉన్నాయన్నారు. వీరు దండుబాట రోడ్డుకు చెందిన కావాటి నాగరాజు, కొత్తపాలేనికి చెందిన అన్నారెడ్డి ఇంద్ర, స్వావర్థపురానికి చెందిన చిన్నబోతుల చంటి, మధు, సన్నీలతో కలిసి దోపిడీలు చేస్తుంటారన్నారు. ఈ క్రమంలో వీరు గత బుధవారం పాతబంగారం కొనుగోలు కోసం చీరాలకు వచ్చిన రెహమాన్‌పై దాడి చేశారు. ఈ కేసులో ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 3 లక్షలు నగదు, రెండు చాకులు, సెల్‌ఫోన్. ఆటోను స్వాధీనం చేసుకున్నారు. తండ్రీ కొడుకు మధు, సన్నీ పరారీలో ఉన్నట్లు డీఎస్పీ చెప్పారు.

సర్టిఫికెట్ల పరిశీలనకు సన్నాహాలు

- క్యాడర్ల వారీగా డీఎస్సీ అర్హులకు సమాచారం
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1100 పోస్టులు.. 23 కమిటీలు

గుంటూరు(విద్య), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. క్యాడర్ల వారీగా అర్హుల జాబితా విడుదలైన నేపథ్యంలో అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు రోజులపాటు సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నట్లు విద్యాశాఖ వర్గాలు వెల్లడిస్తున్నాయి. అయితే ఆదివారం సాయంత్రం వరకు షెడ్యూల్ జారీ కాలేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, పీజీటీ, టీజీటీ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్ తదితర పది విభాగాల్లో 1100కి పైగా పోస్టులను భర్తీ చేయనున్నారు. క్యాడర్ల వారీగా మెరిట్ కం రోస్టర్ జారీ చేయడంతో పాటు అర్హులకు ఇప్పటికే సమాచారం పంపించారు. పరిశీలన కార్యక్రమం సోమవారం లేదా మంగళవారం నుంచి ప్రారంభమవుతుందని విద్యాశాఖ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

ప్రత్యేక కమిటీలు

అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు మండల స్థాయి నుంచి రీజనల్ స్థాయి వరకు దాదాపు ఉమ్మడి జిల్లాలో 23 కమిటీలు ఏర్పాటు చేసినట్లు సమాచారం. ప్రతీ కమిటీలో ముగ్గురు అధికారులు ఉంటారు. ఒక్కో కమిటీకి 50 మంది అభ్యర్థులను కేటాయించి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సర్టిఫికెట్ల పరిశీలన చేయనున్నారు. ఈ క్రమంలో ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి, గుంటూరు డీఈవో రేణుక, డీఈవోలు, ఎంఈవోలు ఆదివారం గుంటూరు ఏసీ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలనకు అవసరమైన ట్రయల్ రన్ నిర్వహించారు.



గుంటూరు ఏసీ కళాశాలలో ట్రయల్ రన్ నిర్వహిస్తున్న అధికారులు

సైక్లింగ్‌తో మానసిక ప్రశాంతత

ఫిట్ ఇండియా ర్యాలీలో ఎస్పీ తుషార్‌డూడి

బాపట్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సైక్లింగ్‌తో మానసిక ప్రశాంతత చేకూరి శారీరక రుగ్మతలు అదుపులో ఉంటాయని ఎస్పీ తుషార్‌డూడి తెలిపారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా సండే ఆన్ సైకిల్ ర్యాలీని జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ప్రారంభించారు. పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఎస్పీ సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ పర్యావరణహితమైన సైక్లింగ్‌తో మానసిక ఒత్తిడి నియంత్రణ, శారీరక దృఢత్వం, ఆరోగ్యం పెంపొందుతాయన్నారు. ప్రకృతితో స్నేహపూర్వక జీవనశైలిపై ప్రజల్లో చైతన్యం కల్పించడమే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. వాహనాల వాడకం పెరిగినకొద్దీ వాయు, ధ్వని కాలుష్యాలతో వాతావరణ మార్పులు గణనీయంగా మారుతున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో ఆరోగ్యకర అలవాటుగా ప్రజలు సైక్లింగ్ చేసేలా ప్రతి ఆదివారం జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ విజయ సారధి, జీ.రామాంజనేయులు, పి.జగదీష్‌నాయక్, ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్, నారాయణ, సీఐలురాంబాబు, శ్రీనివాసరావు, హరికృష్ణ పాల్గొన్నారు.



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ తుషార్‌డూడి

భూసేకరణ జటిలం

పల్నాడు- బాపట్ల జిల్లాలను కలిపే వాడరేవు - నకరికల్లు 167ఏ జాతీయ రహదారి భూసేకరణ సమస్య రోజు రోజుకు జటిలంగా మారుతుంది. భూమి పరిహారం విషయంలో అటు రైతులు.. ఇటు అధికారుల మధ్య ఏళ్లుగా వివాదం కొన సాగుతోంది. పల్నాడు జిల్లా పరిధిలో 38 కిలో మీటర్ల మేర రహదారి నిర్మాణానికి ఈ నెల 2న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో శంకు స్థాపన చేసిన విషయం తెలిసిందే. రూ.787 కోట్లు నిధులు విడుదలయ్యాయి. టెండరు ప్రక్రియ పూర్తయింది. అయితే పల్నాడు జిల్లా పరిధిలో రహదారి నిర్మాణం భూసేకరణ దశలోనే ఆగిపోయింది.

- భూముల పరిహారంపై రోజుకో రేటు
- ఆగిన 167ఏ జాతీయ రహదారి పనులు
- బైపాస్ బాధితులతో సమావేశాలు.. కొలిక్కిరాని సమస్య

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

చిలకలూరిపేట పరిధిలో పూర్తైన జాతీయ రహదారి పనులు



నరసరావుపేట బైపాస్ నిర్మాణంలో భూములకు చెల్లించే పరిహారం విషయంలో ఉన్నతాధికారులు రోజుకో ధర చెబుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. జాతీయ రహదారి పనులు బాపట్ల జిల్లా పరిధిలో వేగవంతంగా జరుగుతుండగా, పల్నాడు జిల్లా పరిధిలో నరసరావుపేట బైపాస్ వద్దకు వచ్చే సరికి నిలిచిపోయాయి. తాజాగా అధికారులు బాధిత రైతు ప్రతి నిధులతో నిర్వహించిన సమావేశంలో కూడా సమస్యకు పరిష్కారం లభించలేదు. తమకు న్యాయం చేయాలని కోరుతూ రైతులు కోర్టులో పిటిషన్లు దాఖలు చేయగా అది విచారణ దశలో ఉంది. భూములకు చెల్లించే ధరపై లిఖిత పూర్వకంగా హామీ ఇస్తేనే కోర్టులో పిటిషన్లు ఉపసంహరించుకుంటామని రైతులు అధికారులకు తేల్చి చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో కోర్టులో కేసు తేలే వరకు భూ సేకరణ దస్త్రం ముందుకు కదిలే పరిస్థితి లేదని తెలుస్తుంది.

రెవెన్యూ హామీ.. స్పందించని హైవే అథారిటీ

నష్టపరిహారం విషయం చెల్లించే విషయంలో రెవెన్యూ అధికారులు సూచించిన పరిహారానికి రైతులు అంగీకరించారు. అయితే ఆ ధరపై హైవే అథారిటీ అధికారులు సానుకూలంగా స్పందించడం లేదు. నరసరావుపేట పట్టణ పరిధిలోని వ్యవసాయ భూమికి రిజిస్ట్రేషన్ విలువపై రెండు రెట్లు, జొన్నలగడ్డ, కేసానుపల్లి, రావిపాడు, గుంటగార్లపాడు గ్రామాల పరిధిలోని భూములకు రిజిస్ట్రేషన్ విలువపై రెండున్నర రేట్లు పరిహారం చెల్లిస్తామని రెవెన్యూ అధికారులు బాధితులకు తెలిపారు. ప్రధాన రహదారి వెంట ఉన్న ఇళ్లస్థలాలకు గజానికి రూ. 19,000, లోపలగా ఉన్న వాటికి రూ. 16,000 చొప్పున చెల్లిస్తామ న్నారు. ఎకరా పొలానికి సుమారు రూ.1.75 కోట్లు చెల్లిస్తామన్నారు. ఈ ధరకు సంబంధించి లిఖితపూర్వకంగా ఒప్పంద పత్రాలు ఇస్తే స్థలాలు ఇస్తామని బాధి తులు చెబుతున్నారు. అయితే లిఖిత పూర్వకంగా ఇవ్వలేమని, హైవే అథారిటీ అధికారులకు ప్రతిపాదించామని కోర్టులో కేసులు ఉపసంహరించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. కోర్టులో కేసులు ఉపసంహరించుకున్న తర్వాత అధికారులు చెప్పినట్లు పరిహారం చెల్లించకపోతే తాము నష్టపోతామని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరు వర్గాల మధ్య ప్రతిష్ఠంభన నేపథ్యంలో వారి మధ్య సమన్వయం కోసం ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కృషి చేస్తున్నారు. ఇప్పటికే ఆయన పలుమార్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి పరిహారంపై చర్చించారు.

అవీ..ఇవీ..

ఉపాధ్యాయ పోస్టులకు 9 మంది ఎంపిక

● నాగరాజుపల్లితండాలోనే ఐదుగురు

మార్టూరు, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 ఫలితాలలో మార్టూరు మండలంలో 9 మంది ఉపాధ్యాయుల పోస్టులకు ఎంపిక య్యారు. వారిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. అయితే మండలంలోని నాగ రాజుపల్లితండాకు చెందిన ఐదుగురు ఉపాధ్యాయుల పోస్టులకు ఎంపిక కావడం విశేషం. అదేవిధంగా కోలలపూడి గ్రామానికి చెందిన ముగ్గురు, మార్టూరు గ్రామానికి చెందిన ఒక యువతి ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు.

కానిస్టేబుల్‌గా, ఉపాధ్యాయురాలిగా ఎంపిక

ఇటీవల ప్రకటించిన కానిస్టేబుల్ ఫలితాలలో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన భుక్యా అంజమ్మబాయి డీఎస్సీ ఫలితాలలోనూ ఎస్‌జీటీ పోస్టుకు ఎంపికయ్యారు. అయితే రెండు ఉద్యోగాలు సాధించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని, తాను ఉపాధ్యాయురాలిగా సేవలందించ నున్నట్లు తెలిపారు.

వైద్యశిబిరానికి విశేషస్పందన



వైద్యశిబిరానికి హాజరైన ప్రజలు

వాడరేవు (చీరాల), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వాడరేవు రామానంద ఆశ్రమం ప్రాంగణంలో నిర్వహించాన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. దాదాపుగా 1178 మంది ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో బీపీ, షుగర్, దీర్ఘకాలిక వ్యాధులకు పరీక్షలు చేసి ఉచిత మందులు పంపిణీ చేశారు. అలాగే పరీక్షలకు హాజరైన వారికి ఆశ్రమ ప్రతినిధులు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన వసతి కల్పించారు. డా.రాజరాజేశ్వరి, డా.కమలా రాజేశ్వరి, డా.లలిత్ ప్రకాష్, డా.పేట శ్రీకాంత్, డా. ప్రకాష్ ఆశ్రమ ప్రతినిధులు మేనేజర్ సురేష్, ట్రస్టు ఉపాధ్యక్షులు కృష్ణారావు, ఫణి కిషోర్, చందన పాల్గొన్నారు.

వీర్లగంగమ్మకు ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో వీర్లగంగమ్మ

బల్లికురవ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఎంతో ప్రసిద్ధి గాంచిన వీర్ల గంగమ్మ దేవాలయం వద్ద ఆదివారం బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరు సంతోషంగా ఉండాలని ఎవరు ఎలాం టి ఘర్షణలకు పాల్పడ కుండా శాంతియుతంగా జీవనం సాగించాలని ఈసందర్భంగా అయన గంగమ్మ తల్లి వద్ద పూజలు చేశారు. అలానే పలు గ్రామాల నుంచి భక్తులు గంగమ్మను సందర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని దర్శించుకొన్న వారిలో సీఐ వెంకట్రావు, నారాయణ, శేషగిరారావు, ఎస్ఐలు నాగరాజు, పట్టాభిరామయ్య, వేమన, జీవీ.చౌదరి, సబ్ డివిజన్‌లోని పోలీసు సిబ్బంది ఉన్నారు.

మట్టి వినాయక ప్రతిమలు పంపిణీకి సిద్ధం

ఇంకొల్లు, ఆగస్టు 24,(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి సందర్భంగా ఇంకొల్లు హరిహరధార్మిక సేవాసంస్థ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీకి సిద్ధం చేసినట్లు ఆసంస్థ ప్రతినిధులు తెలిపారు. ఇంకొల్లులో నాగులచెరువు వద్ద ఉన్న తటాకాంజనేయస్వామి ఆలయం, శివాలయం, చెన్నకేశవ స్వామి దేవాలయం వద్ద 25వ తేదిన నుండి సుమారు 2000 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీకి సిద్ధం చేసామని నిర్వాహకులు తెలిపారు.పర్యావరణ పరిరక్షణతో పాటు కాలుష్య నివారణకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నామని భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇంకొల్లు విద్యార్థినులకు మెడికల్ సీట్లు

ఇంకొల్లు, ఆగస్టు 24,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లుకు చెందిన ఇద్దరు విద్యార్థినులు నీట్ పరీక్షలలో ర్యాంకులు సాధించగా ఆదివారం వెలువడిన ఆన్‌లైన్ కౌన్సిలింగ్ ఫలితాల్లో మెడికల్ కళాశాలల్లో సీట్లు పొందారు. ఇంకొల్లుకు చెందిన జాగర్లమూడి మన్విత్రామహాలక్ష్మీ తిరుపతి శ్రీపద్మావతి మెడికల్ కళాశాలలో సీటు పొందగా, యడ్లూరి మేఘన ఒంగోలు రిమ్స్ మెడికల్ కళాశాలలో సీటు పొందినట్లు తల్లిదండ్రులు వేణుబాబు, ప్రసాద్‌లు తెలిపారు. విద్యార్థినులను పలువురు అభినందించారు.

ప్రజల ఆరోగ్యం కోసమే వైద్యశిబిరం ఏర్పాటు



మందులను పంపిణీ చేస్తున్న తిరుపతిరాజు తదితరులు

మార్టూరు, ఆగస్టు24 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో పేద కుటుంబాల ఆరోగ్య రక్షణ కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి నట్లు మాజీ సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతిరాజు అన్నారు. ఆదివారం మండలంలోని రాజుగారిపాలెం గ్రామంలో ఒంగోలులోని ఉపాస్ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. ఈ వైద్యశిబిరాన్ని మాజీ సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతిరాజు ప్రారంభించారు. వైద్యశిబిరానికి 150 మంది ప్రజలు హాజరయ్యారు. వారికి వైద్యులు ఉచితంగా షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. 13 మందికి మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలుకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు యు జయవర్దన్, డాక్టరు జగదీష్, మేనే జరు ఆనంద్, విద్యాకమిటి చైర్మన్ సీహెచ్ శ్రీనివాస్, యు శివరామప్రసా ద్, డి వెంకట శివప్రసాద్‌రాజు, యు వెంకటరామరాజు, డి నాగేశ్వరరావు, చింతలపూడి శ్రీనివాసరావు, రామాంజనేయులు పాల్గొన్నారు.

అధ్యక్ష పీఠంపై ఎవరో ?

(5వ పేజీ తరువాయి)

అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకోనున్నది.

ప్రస్తుత అధ్యక్షుడు సలగల...

ప్రస్తుతం బాపట్ల పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడిగా సలగల రాజశేఖర్‌బాబు ఉన్నారు. ఇటీవల నామినేటెడ్ నియామకాల్లో భాగంగా సలగలను బావుడా చైర్మన్ పీఠం వరించిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే గ్రామ కమిటీలు మొదలుకుని మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ఖాళీగా ఉన్న అనేక పదవులపై తెలుగు తమ్ముళ్లు ఆశలు పెట్టుకున్నారు. దీనిలో భాగంగానే పార్లమెంట్ స్థానం అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియను ఈ నెలాఖరు కు కొలిక్కి తేవాలనేది అధిష్ఠానం ఆలోచనగా ఉంది. కొత్తగా ఎన్నికయ్యే అధ్యక్షుడి సారథ్యంలోనే పార్టీ పదవుల భర్తీని చేపడితే సమన్వయం కూడా కుదిరి భవిష్యత్తులో మంచి ఫలితాలు సాధించడానికి అవకాశం ఉంటుందనేది టీడీపీ వ్యూహంగా ఉంది.

స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా.

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పుడు చేపట్టబోయే అధ్యక్ష ఎన్నిక కూడా ఆ పోరును దృష్టిలో పెట్టుకునే జరగనుంది. ముఖ్యం గా పార్టీ శ్రేణులను ఏకతాటిపై నడపడంతో పాటు, క్షేత్రస్థాయిలో కార్యకర్త ల సాదకబాధలను పట్టించుకోవాల్సిన బాధ్యత పార్టీ అధ్యక్షుడిపైనే ఎక్కు వగా ఉండనుంది. ఇదే కాకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ కోసం ఆశావహులు భారీగా ఉండనున్నారు. వారందర్నీ ఏకతాటిపైకి తెచ్చి పోటీ లో ఉండే అభ్యర్థికి జై కొట్టించడం అనే సవాల్ కూడా ఈ ఎంపిక మీదనే ఆధారపడనున్నది.

చింత తీర్చిన చిరు సాయం

● దివ్యాంగుడికి మూడు చక్రాల స్కూటీ అందజేసిన మంత్రి రవికుమార్ ● దానితోనే ఉపాధి మార్గం చూసుకొని స్ఫూర్తి



భార్యతో పాటు ప్లాస్టిక్ బండిని తగిలించుకొని వెళుతున్న శ్రీను

బల్లికురవ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): చిరుసాయం ఆయన జీవితంలో కొత్త వెలుగులు తీసుకొచ్చింది. చిన్నతనం నుంచి రెండు కాళ్లు పనిచేయకున్నా.., ఆర్థికంగా సొంత కాళ్లపై నిలబడాలన్న ఆయన లక్ష్యానికి ఆ సాయమే ఉపకరించింది. దివ్యాంగుండైన మల్లా శ్రీనుకు ఇటీవల మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్కూటీని అందజేయగా, దీనికి వెనుక ట్రాలీ బిగించుకొని ఆ ట్రాలీపై చిరువ్యాపారం చేస్తూ జీవనం వెళ్లదీస్తూ పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నాడు.

బల్లికురవ ఎస్టీ కాలనీకి చెందిన మల్లా శ్రీనుకు చిన్న తనం నుండే రెండు కాళ్లు పనిచేయడం లేదు. వివాహం అయిన సమయం నుంచి తన భార్యపైనే ఆధార పడి బతుకు బండిని నెట్టుకొస్తున్నాడు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బల్లికురవ గ్రామానికి వచ్చిన మంత్రి రవికుమార్‌ను మల్లా శ్రీను నేలపై పాకుతూ కనిపించాడు. స్పందించిన మంత్రి మూడు చక్రాల స్కూటీని అందిస్తాను నడుపుతావా..? అని అడిగి స్కూటీని అందజేశారు. అయితే కేవలం తన అవసరాల కోసం ఆ స్కూటీని వినియోగించకుండా కుటుంబానికి చేదోడుగా ఉండేలా చిరువ్యాపారం చేయడానికి శ్రీను స్కూటిని వినియోగిస్తున్నాడు. వెనుక చిన్న ట్రాలీని బిగించి దానిపై ప్లాస్టిక్ సామాన్లు అమ్ముకుంటూ జీవనం వెళ్లదీస్తున్నాడు. భార్యను కూడా తనతోపాటు గ్రామాలకు తీసుకెళ్లి సాయత్రం వరకు ప్లాస్టిక్ సామాన్లు అమ్మకాలు చేపట్టి ఇంటికి వస్తున్నాడు. కాళ్ల పనిచేయకున్నా, తనకు మూడుచక్రాల వాహనం తన కుటుంబాన్ని పోషించుకుంటున్న దివ్యాంగుడు మల్లా శ్రీనును ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు. ఆయనకు ముగ్గురు కుమారులు కాగా, తన తమ్ముడి కుమార్తెలకు తానే చేదోడు వాదోడుగా నిలుస్తున్నాడు.

మంత్రి రవికుమార్ తోడ్పాటు మరువలేనిది

నేలపై పాకుతూ నడవలేని స్థితిలో ఉండగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ నాకు మూడు చక్రాల బైకును అందించాడు. ఈ బైకు తనకు ఎంతో ఉపయెగంగా ఉంది. గ్రామాలలో చి రు వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. మంత్రి రవికుమార్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ప్రభుత్వం సబ్సిడిపై రుణం అందిస్తే వ్యాపారానికి ఉపయోగంగా ఉంటుంది. మల్లా శ్రీను

దమ్ము చక్రాలతో వాహనాలు నడిపితే చర్యలు

ట్రాక్టర్ల యజమానులతో పోలీసు శాఖ సమావేశం



హాజరైన రైతులు, మాట్లాడుతున్న డీఎస్పీ

బల్లికురవ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కోట్ల రుపాయల నిధులతో అభివృద్ధి పరిచిన తారు రోడ్లపై దమ్ముచక్రాల ట్రాక్టర్లు నడిపి వాటిని గుల్ల చేస్తే కేసులు నమోదు చేస్తామని బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు హెచ్చరించారు. ఈ నెల 21న 'ఆంధ్రజ్యోతి'లో 'దడపుట్టిస్తున్న దమ్ముచక్రాలు' శీర్షికన వార్త ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఆది వారం మండలంలోని చెన్నుపల్లి గ్రామంలో పలు గ్రామాలలో దమ్ముచక్రాలు వినియో గిస్తున్న ట్రాక్టర్ల యజమానులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మాగాణి సాగుకు దమ్ము చక్రాలు అవసరమే కాని రైతులు రోడ్లు దెబ్బతినకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాల న్నారు. దమ్ముచక్రాలకు రబ్బరు తొడుగులు దరించిన తర్వాతే రోడ్లపైకి రావాలన్నారు. ఎవరైన రోడ్లను గుల్లచేస్తే వారి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ప్రతిరోజు రోడ్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. రైతులు పూర్తిగా సహకరించాలన్నారు. ట్రాక్టర్ల వివరా లను సేకరిస్తామన్నారు. అన్ని గ్రామాలలో ట్రాక్టర్ల డ్రైవర్లు, యజమానులతో ప్రత్యేక సమావేశాలే నిర్వహించి రోడ్లు దెబ్బ తిన కుండా కట్టడి చేస్తామన్నారు. అలానే డ్రైవర్లకు లైసెన్స్‌లు అందించేందుకు ప్రత్యేక మేళా నిర్వహిస్తామన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతిఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. అలానే వినాయక చవితి పండగ సందర్భంగా విగ్రహాలు ఏర్పాటు చేసే వారు రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. బొమ్మల వద్ద రోడ్డుపై వీటిని పెట్టుకోవాలన్నారు. సమావేశంలో సంతమాగు లూరు సర్కిల్ సీఐ కాకుమాను వెంకట్రావు, ఎస్ఐ వై. నాగరాజు, ఆర్అండ్‌బి జెఈ బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

నామ్ రహదారి అంచులో పండ్ల లారీ బోల్తా

డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలు



బోల్తాపడ్డ పండ్లలారీ

అద్దంకి, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): యాపిల్ పండ్ల లారీ నామ్ రోడ్డులో అర్ధరాత్రి సమయంలో రోడ్డు అంచులో బోల్తా పడింది. సిమ్లా నుండి చెన్నైకు పండ్లతో ఈ లారీ వెళుతోంది. శనివారం అర్ధరాత్రి దాటిన తరు వాత అద్దంకి-మేదరమెట్ల మధ్య బలరా మకృష్ణాపురం సమీపంలో నామ్ రోడ్డులో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదం లో హర్యానా రాష్ట్రానికి చెందిన లారీడ్రైవర్ రాజేష్, క్లీనర్ విక్కీలకు స్వల్ప గాయాల య్యాయి. 108 వాహనం సిబ్బంది అక్కడకు చేరు కొని వారికి ప్రాథమిక చికిత్స చేశారు. ఏఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ఎక్స్‌కవేటర్‌తో లారీని పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీక రించారు. విషయం తెలు సుకున్న సమీప గ్రామాల ప్రజలు, అటు వైపు వెళ్లే వాహనాల చోదకులు యాపిల్స్‌ను కొంతమేర తీసుకువెళ్లడం గమనార్హం.

లారీలో ల్యాప్‌టాప్‌లు చోరీ

- 253 ల్యాప్‌టాప్‌లు మాయం
- రూ. 90 లక్షల విలువైన సొత్తు చోరీ
- డ్రైవర్, క్లీనర్ కోసం గాలింపు



వివరాలను తెలుసుకుంటున్న డీఎస్పీ మొయిన్

మేదరమెట్ల, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): లారీలోని విలువైన ల్యాప్‌ట్యాప్‌లు చోరీకి గురైన ఘటనపై మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేశారు. వి వరాలలోకి వెళ్తే ఈ నెల 23న హైదరబాద్ నుండి ల్యాప్‌టాప్‌లు, మానిటర్, పింటర్‌లు, ట్యూనర్‌లతో కంటైనర్ లారీ చెన్నై బయలుదేరింది. అద్దంకి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉండగానే శుక్రవారం 2.30 గంటల సమయంలో కంటైనర్ లారీ సీల్ బ్రేక్ అయినట్లు కంపెనీ ప్రతినిధులకు మెసేజ్ వెళ్లింది. దీంతో వారు వెంటనే కంటైనర్ లారీ డ్రైవర్‌కు పోన్ చేసి సీల్ బ్రేక్ అయిందని, ఒక సారి చూసుకోవాలని చెప్పారు. అక్కడ నుండి లారీడ్రైవర్, క్లీనర్ పోన్లుస్విచ్ ఆఫ్ అయ్యాయి. లారీని మేదరమెట్ల బైపాస్ లోని ఓ దాబా వద్ద నిలిపి వారు పరార య్యారు. దీంతో కంపెనీ ప్రతినిధులు వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కంపెనీ ప్రతినిధుల సమక్షంలో కంటైనర్‌లోని వస్తువులను పరిశీలించారు. కంటైనర్‌లో ఉండాల్సిన 253 ల్యాప్‌టాప్‌లు ఒక మానిటర్, ట్యూనర్ ఒకటి కనిపించడం లేదని పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. మేదరమెట్ల పోలీస్‌స్టేషన్‌కు చేర్చిన ఈ కంటైనర్‌ను చీరాల డీఎస్పీ మొయిన్, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావులు మేదరమెట్ల ఎస్ఐ మహమ్మద్ రఫీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధుల నుంచి డీఎస్పీ మొయిన్ అన్ని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే రెండు టీంలను నిందితులకోసం పంపినట్లు తెలిపారు. త్వరలోనే ల్యాప్‌టాప్‌లను దొంగిలించిన దొంగలను పట్టుకుంటామన్నారు.

విద్యావకాశాలను అందిపుచ్చుకోవాలి

ప్రకాశం పంతులు మునిమనుమరాలు సుభాషిణి



మాట్లాడుతున్న ప్రకాశం పంతులు మునిమనుమరాలు కేవీఎల్ సుభాషిణి

అద్దంకిటౌన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నాటి విద్య అవకాశాల కంటే ప్రస్తుతం మెరుగైన విద్యా అవకాశాలు, వసతులు ఉన్నాయని వాటి ని సద్వినియోగపర్చుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని టంగుటూరి ప్రకాశం పంతులు ముని మనుమరాలు కేవీఎల్ సుభాషిణి అన్నారు. ఆదివారం టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతి సందర్భం గా ప్రకాశం మిత్రమండలి ఆధ్వర్యంలో స్థానిక వాసవి కళ్యాణ మండపంలో పదవ తరగతిలో 550, ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థు లకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం ఇలపావులూరి శేషతల్పసాయి నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుభాషిణి పాల్గొని మాట్లాడారు. ముందుగా బంగ్లా రోడ్డులోని టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పిం చారు. అనంతరం కళ్యాణ మండపంలో జరి గిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నాడు చదువుకునేందుకు పడిన కష్టాలును వివరిం చి నేటి చదువుకునేందుకు ఉన్న సౌకర్యాలను అవకాశాలను, టెక్నాలజీని సద్వినియోగ పరుచుకోవాలన్నారు. శ్రీ ప్రకాశం ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు సుభాషిణి స్వయంగా నగదు బహుమతిని అందజేశారు. చప్పిడి వీరయ్య దంపతులు గురకాయపాలెం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు, గాడేపల్లి దివాకర్ దత్తు దంపతులు కాకానిపాలెం జెడీ ్పెహెచ్ ఎస్ విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. అనంతరం మండలంలోని 2024-25 విద్యా సంవత్సరంలో 550, ఆ పైన మార్కులు సాధించిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలోని 210 మంది విద్యార్థులకు బహు తులను అందజేసినట్లు మిత్రమండలి అధ్య క్షులు శేషతల్పసాయి తెలిపారు. కార్యక్రమంలో ఊటుకూరి ఉమా అన్నపూర్ణ, వి. కృష్ణసుభాన్, రావూరి రంగయ్య, కేవీ.మారుతిరావు, ఊటు కూరి రామకోటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, మహమ్మద్ రఫీ విద్యార్థుల, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

చినగంజాం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి) : ఖినాయక విగ్రహల మండపాల ఏర్పాటుకు ముందుగా పోలీసు వారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్.ఐ శీలం రమేష్ అన్నారు. పర్యావరణానికి ముప్పు కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిష్‌తో రూపొంది చిన విగ్రహాలు కాకుండా సహజసిద్ధంగా మట్టితో తయారు చేసిన విగ్రహాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విగ్రహాల ఎత్తు , బరువు, ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య నిమజ్జనం చేసే తేది, సమయం, నిమజ్జన మార్గం, నిమజ్జనానికి ఉపయోగించే వాహన వివరాలను విధిగా తెలియజేయలన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా ఆర్జీదారుడు, కార్యనిర్వాహకులే బాధ్యత వహించవలసి ఉంటుందని తెలిపారు. కేటాయించిన ప్రదేశాలలో మాత్రమే నిమజ్జనం చేయాలన్నారు. మండపాల వద్ద ఊరేగింపు సమయాలలో అసభ్యకరమైన డాన్సులు, ఇతర పదర్శరలు నిర్వహిస్తే తగు చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంతమాగులూరు : మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే కమిటీ వారు అనుమతి తప్పనిసరిగా తీసుకో వాలని సీఐ కే వెంకట్రావు, ఎస్సై మెదరమెట్ల పట్టాభిరామయ్య తెలిపారు, విగ్రహాలు ప్రధాన రహదారులపై ఏర్పాటు చేయరాదని వారు తెలిపారు, విగ్రహానికి సింగిల్ విండో విధానం ద్వారా అనుమతిస్తున్నట్లు తెలిపారు. పోలీసువారి పరిశీలించిన ఒక క్యూఆర్ కోడ్ విగ్రహం వద్ద అంటించవలెనని, ప్రతి విగ్రహానికి కనీసం ఆరుగురు వ్యక్తులు (సభ్యులు) కమిటీగా ఉండాలి, వారి వివరాలు పోలీస్‌స్టేషన్లో ఇవ్వాలన్నారు. వినాయక విగ్రహానికి సంబంధించిన ప్రతి విషయం కమిటీ వారు బాధ్యత వహించాలన్నారు. ప్రతి వినాయక విగ్రహం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అది విగ్రహం చుట్టూ ఉన్న ప్రాంతాన్ని నిరంతరం మానిటర్ చేసేలా ఉండాలి. తద్వారా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడవచ్చన్నారు. విగ్రహ నిమజ్జనం ఏర్పాటు సమయంలో ట్రాఫిక్, శబ్ద కాలుష్యాన్ని నివారించాలన్నారు. నిబంధనలు పాటించాలనీ, ఏటువంటి అనుమతి లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఏదైన సమస్య ఉంటే స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్సై పట్టాభిరామయ్య సూచించారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలకు ప్రణాళిక

● సంత జరిగే సమయంలో నిలుస్తున్న వాహనాలు

అద్దంకి, ఆగస్టు24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏఎంసీ ప్రాంగణం వద్ద సంత జరిగే సమయంలో నామ్‌రోడ్డులో మార్కెట్ యార్డు వద్ద తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. అదే సమయంలో కొనుగోలు దారులు ఎదురుగా వస్తుండడంతో ప్రమాదాలకు అవకాశం లేకపోలేదు. అయితే నివారణ చర్యలపై సీఐ సుబ్బరాజు ప్రత్యేక దృష్టి సారించారు. నామ్ రోడ్డు పక్కన ఉన్న సర్వీసు రోడ్డు లో అమ్మకాలు చేయకుండా చర్యలు చేపట్టడంతో పాటు ప్రస్తుతం మార్కెట్ యార్డులో నుంచి నామ్ రోడ్డు వైపు ఉన్న మెయిన్ గేటులో నుంచి సంతలోనికి రాకపోకలు సాగిస్తున్నారు. దీని ద్వారా నేరుగా నామ్ రోడ్డులోకి వస్తుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో వచ్చే వారం నుండి మెయిన్ గేట్ ను మూసి వేసి వేలమూరిపాడు రోడ్డు వైపు ఉన్న గేటును తెరవటం ద్వారా పార్కింగ్ సమస్య పరిష్కరించవచ్చనే నిర్ణయానికి వచ్చారు. అదే సమయంలో సర్వీస్ రోడ్డులో కూడా వ్యాపారాలు చేయకుండా నివారించే అవకాశం ఉంటుందని, సంతకు వచ్చే వాహనచోదకులు సర్వీసు రోడ్డులో నుంచి ప్రయాణించే వీలు కలుగుతుందనే ఆలోచన చేస్తున్నట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

టీడీపీ సీనియర్ నేత వెంకటేశ్వర్లు మృతి

● సేవాకార్యక్రమాలే లక్ష్యంగా పనిచేసిన వ్యక్తిగా గుర్తింపు



మున్నంగి వెంకటేశ్వర్లు (ఫైల్)

కొమర్నేనివారిపాలెం(పర్చూరు), అగస్టు 24 (ఆంధ్రజ్యోతి) :పర్చూరు మండలం కొర్నేనివారిపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మున్నంగి వెంకటేశ్వర్లు(89) ఆదివారం మృతి చెందారు. సేవే లక్ష్యంగా గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమంలో తనవంతు ఆర్థిక సహకారం అందించి సేవా నిరతిని చాటారు. అందులో ప్రధానంగా కళ్యాణ మండపాలు, చర్చ్‌ల నిర్మాణంతోపాటు, పోతుకట్ల గ్రామంలో ధ్వయస్థంబ నిర్మాణానికి కూడా సాయమందించారు. పర్చూరు మండలం నాగులపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న బదిరుల పాఠశాలకు తనవంతు సహకారం అందిస్తూ విద్యార్థుల అభ్యున్నకి దోహదపడుతున్నారు. నేడు స్వగ్రామంలో అంత్యక్రియలు జరుగుతాయని సర్పంచ్ మున్నంగి వెంకటసుబ్బయ్య తెలిపారు.

చీరాల్లో భారీగా పట్టుబడిన గంజాయి

● తనిఖీలు నిర్వహిస్తూ 8.100 కిలోల గంజాయి గుర్తింపు



పట్టుబడిన గంజాయితో అధికారులు

చీరాల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : చీరాల రైల్వే స్టేషన్‌లో భారీగా గంజాయి పట్టుబడింది. అధికారులు ఆదివారం రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాం నెంబర్-3లో నిలిచిన బిలాస్‌పూర్ - తిరుపతి రైలులో తనిఖీలు నిర్వహిస్తుండగా 8.100 కిలోల గంజాయిను గుర్తించారు. వాటిని తహసీల్దార్ గోపీకృష్ణ సమక్షంలో సీజ్ చేశారు. నిందితులు బీహార్‌కు చెందిన వారుగా అనుమానిస్తున్నారు. తనిఖీలలో ఈగల్ టీం, జీఆర్పీ పోలీసులు, ఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

హైదరాబాద్ నుంచి చీమకుర్తికి వినాయకుని విగ్రహం



నాం రోడ్డు నుంచి తరలుతున్న వినాయకుడు

అద్దంకి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వినాయక చవతికి వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు పోటీలు పడి భారీ విగ్రహాలను ఏర్పాటు చేస్తుంటారు. ఈ క్రమంలో చీమకుర్తికి చెందిన వ్యక్తులు హైదరా బాద్ నుంచి ఆదివారం వినాయకుడి విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారు చేసిన ట్రాలీ లో తీసుకెళ్లారు. సుమారు 16.5 అడుగుల ఎత్తైన ఈ వినాయక విగ్రహం అద్దంకి పట్టణంలో నుంచి వెళుతుండడంతో స్థానికులు ఆసక్తిగా గమనించారు. విగ్రహం కొనుగోలు, రవాణాతో కలిపి రూ.2 లక్షలు ఖర్చు అయ్యిందని వారు తెలిపారు.

గేదె అపహరణ

అద్దంకి, ఆగస్టు24 (ఆంధ్రజ్యోతి): కట్టివేసిన గేదెను దొంగలు అపహరించుకు పోయారు. మండలంలోని వెంపరాల లో సొసైటీ మాజీ అధ్య క్షుడు మాదాల రామకృష్ణ తన గేదెను ఇంటి సమీపం లో కొష్టం వద్ద కట్టివేశాడు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గేదెను అపహరించుకుపోయారు. గేదెను ఇటీవల రూ.90 వేలకు కొనుగోలు చేసినట్లు రామకృష్ణ తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇళ్ల వద్ద కట్టివేసిన గేదెలు అపహరణ కు గురవుతుండడంతో పశుపోషకలు ఆందోళన చెందుతున్నారు.


అడిగినంత ఇస్తేనే.. అనుమతి

(5వ పేజీ తరువాయి)

మొత్తం కంటే పది రెట్లు అదనంగా మామూళ్ల రూపంలో చెల్లించుకోవాల్సి వస్తోందని సభ్యులు వాపోతున్నారు.

చెప్పేదొకటి... చేస్తున్నదొకటి

బుధవారం చవితి. దీంతో పట్టణాలు, గ్రామాల్లో వాడవాడలా గణేశుని విగ్ర హాల ఏర్పాటుకు పందిళ్లు వెలుస్తున్నాయి. మండపాలకు సంబంధించి అనుమతి తప్పనిసరి అని ప్రభుత్వం ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు వీలుగా 'గణేశ్ ఉత్సవ్ 2025 ఆన్‌లైన్ పర్మిషన్' పేరుతో ఒక పోర్టల్‌ను తీసుకొచ్చింది. ఇందులో దరఖాస్తుతో పాటు పోలీస్, ఫైర్ వంటివాటికి చెల్లించాల్సిన మొత్తాలను ఆన్‌లైన్‌లో చెల్లించే స్తే సరిపోతుంది. అయితే ఆన్‌లైన్ విధానంతో మామూళ్లురావని భావించిన పోలీసులు, ఫైర్, విద్యుత్ తదితర శాఖల అధికారులు సొంతంగా సరికొత్త షర తులు పెట్టారు. దీంతో ప్రభుత్వం చెప్పినట్లుగా సింగిల్ విండో విధానం జిల్లాలో ఎక్కడా అమలు కావడంలేదు.





కోనేరులో స్వామివారి తెప్పోత్సవం (అంతర్‌చిత్రం) తెప్పపై వెంకయ్యస్వామి

నేత్రానందంగా తెప్పోత్సవం

- వైభవంగా ముగిసిన వెంకయ్యస్వామి ఆరాధన
- అంగరంగ వైభవంగా రథోత్సవం
- కిక్కిరిసిన గొలగమూడి వీధులు
- స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి దంపతులు

వెంకటాచలం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): భగవాన్ వెంకయ్యస్వామి 43వ ఆరాధనోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారికి తెప్పోత్సవాన్ని నేత్రానందంగా నిర్వహించారు. స్వామి ఆశ్రమం పక్కనే ఉన్న కోనేరులో ఏర్పాటు చేసిన తెప్పను, రంగురంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. తెప్పపై వెంకయ్య స్వామివారిని ఆశీనులను చేసి పరిమళభరిత పుష్పాలతో అలంకరించారు. కళ్లు మిరుమిట్లు గొలిపే బాణ సంచా కాంతులు, మేళతాళాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెప్పోత్సవం జరుగుతున్నంతసేపూ భక్తులు 'ఓం నారాయణ.. ఆది నారాయణ'... అంటూ భజనలు చేశారు. కార్యక్రమాన్ని తిలకించడానికి భక్తులు కోనేటి కట్టపై బారులు తీరారు. రాత్రికి పలు సాంస్కృతిక, నాటక ప్రదర్శనాలు నిర్వహించారు.



గొలగమూడి వీధుల్లో సాగుతున్న రథం

వేడుకగా రథోత్సవం

ఆదివారం ఉదయం 10 గంటలకు స్వామివారికి వైభవంగా రథోత్సవం నిర్వహించారు. తొలుత రథాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి లాగి ప్రారంభించారు. అనంతరం రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. కాగా అంతకు ముందు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జ్యోతమ్మ దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వారికి ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తదుపరి అన్నదాన సత్రంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణను సోమిరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలని, ప్రజలందరికీ మంచి జరగాలని స్వామివారిని కోరినట్లు తెలిపారు. వెంకయ్యస్వామి ఆశ్రమం సర్వేపల్లి నియోజకవర్గంలో ఉండడం తన అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఆయన వెంట ఆలయ పాలక మండలి సభ్యులు, వివిధ శాఖల అధికారులు, పలువురు టీడీపీ నేతలు ఉన్నారు.



స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకు వెళుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి దంపతులు

కిక్కిరిసిన గొలగమూడి

ఉత్సవాల్లో చివరిరోజు గొలగమూడి భక్తులతో కిక్కిరిసింది. స్వామివారి సమాధి మందిరాన్ని దర్శించుకోవడానికి భక్తులు గంటలకొద్దీ క్యూలో నిలబడ్డారు. భక్తుల కోసం ఆశ్రమం వారు మంచినీరు, మరుగుదొడ్లు లాంటి వసతులు కల్పించారు. ఉచిత వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

'సంస్థాగత' సందడి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడి ఎంపికకు ప్రత్యేక కమిటీ
- సభ్యులుగా మంత్రి సత్యప్రసాద్, నాని, రాకేష్
- ఒకేసారి అనుబంధ సంఘాల నియామకం
- రేపు జిల్లా నేతలతో విస్తృతస్థాయి సమావేశం



నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయం

నెల్లూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నిన్నటివరకూ నామినేటెడ్ పదవుల భర్తీతో ఖుషీఖుషీగా ఉన్న టీడీపీ కేడర్‌లో ఇప్పుడు సంస్థాగత ఎన్నికల సందడిని నెలకొంది. కీలకమైన జిల్లా కమిటీ, అనుబంధ కమిటీల నియామకానికి పార్టీ అధిష్ఠానం కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా ప్రతీ పార్లమెంటుకు ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు ఉన్నారు. నెల్లూరు పార్లమెంటు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు అనుబంధ సంఘాలకు కమిటీలను ఏర్పాటు చేసేందుకు ముగ్గురితో కమిటీ ఏర్పాటైంది. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్ ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ మంగళవారం జిల్లాకు రానుంది. నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో ఆ రోజున విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నది.

పార్టీ నేతలకు ఆహ్వానం

జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు నుంచి మండల పార్టీ అధ్యక్షుల వరకూ ఈ సమావేశంలో పాల్గొనాల్సిందిగా ఆహ్వానం అందింది. ఈ సమావేశంలో ప్రధానంగా జిల్లా అధ్యక్షుడి ఎన్నికపై చర్చ సాగనున్నది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతి నిధులతోపాటు ముఖ్య నేతల నుంచి కమిటీ సభ్యులు అభిప్రాయం తీసుకోనున్నారు. అలానే 17 అనుబంధ సంఘాల నియామకాలపై కూడా కేడర్‌తో చర్చించనున్నారు. వీటికి సంబంధించిన ప్రతిపాదనలు కూడా తీసుకోనున్నారు. ఇలా జిల్లా నుంచి అందిన ప్రతిపాదనలను క్రోడీకరించి తుది నివేదికను ఈ కమిటీ పార్టీ అధిష్ఠానానికి అందించనుంది. ఆ నివేదిక ప్రకారం పార్టీ అధిష్ఠానం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను నియమించనుంది.

ఐదేళ్ల తరువాత నియామకం

దాదాపు ఐదేళ్ల తర్వాత జిల్లా కమిటీ, అనుబంధ సంఘాల కమిటీలకు సంస్థాగత ఎన్నికలు జరుగుతుండడంతో అధికార పార్టీలో సందడి నెలకొంది. ప్రస్తుతమున్న కమిటీలు 2020 సెప్టెంబరులో ఎన్నికయ్యాయి. నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడిగా అబ్దుల్ అజీజ్, ప్రధాన కార్యదర్శిగా చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి కొనసాగుతున్నారు. సాధారణంగా ప్రతీ రెండేళ్లకు ఒకసారి కొత్త కమిటీలను ఏర్పాటు చేస్తుంటారు. అయితే కరోనా విపత్కర పరిస్థితులు రావడం, ఆ తర్వాత పార్టీ సభ్యత్వ నమోదు జరగడం, ఆ వెంటనే సాధారణ ఎన్నికలు రావడంతో కొత్త కమిటీల ఏర్పాటు జరగలేదు. గత మేలో జరిగిన మహానాడులోపే జిల్లాల కమిటీలను నియమించాలని భావించారు. ఆ క్రమంలోనే మండల స్థాయి వరకూ కమిటీల ఏర్పాటును పూర్తి చేశారు. అయితే నామినేటెడ్ పదవుల భర్తీ నేపథ్యంలో జిల్లా కమిటీల ఏర్పాటులో జాప్యం జరిగింది. ఆ ప్రక్రియ ఇప్పుడు మొదలైంది. నెలలోపు కొత్త అధ్యక్షుడి నియామకంతోపాటు కొత్త అనుబంధ కమిటీలను ఏర్పాటు చేయాలని టీడీపీ అధిష్ఠానం భావిస్తోంది. కాగా ఇతర పార్లమెంట్ సెగ్మెంట్ల అధ్యక్షులు, ప్రధాన, అనుబంధ కమిటీల ఎంపికకు ఏర్పాటు చేసిన కమిటీల్లో జిల్లాకు చెందిన పలువురి నేతలకు చోటు దక్కింది. నరసాపురం పార్లమెంటు కమిటీలో మంత్రి పొంగూరు నారాయణ, విజయవాడ పార్లమెంటు కమిటీలో పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, రాజంపేట పార్లమెంటు కమిటీలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నంద్యాల పార్లమెంటు కమిటీలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కడప పార్లమెంటు కమిటీలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర సభ్యులుగా ఉన్నారు.

నిధుల స్వాహాకు అడ్డుకట్ట

- ఒకటి నుంచి స్వర్ణ పంచాయతీ పోర్టల్ సేవలు
- ప్రతి రూపాయికీ లెక్క చూపాల్సిందే !
- పారదర్శకంగా నిధుల జమాఖర్చులు

గ్రామ పాలనలో కొత్త ఒరవడి



చేజర్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): దీపం ఉండగానే ఇళ్లు చక్కదిద్దుకోవాలన్న ఆలోచనతో గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామ పంచాయతీల పాలన గాడి తప్పింది. కొంతమంది అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చేతివాటం ప్రదర్శించి, పంచాయతీల్లో నిధుల స్వాహాకు శ్రీకారం చుట్టారు. ఆ సమయంలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవరడంతో రూ. లక్షల నిధులు దుర్వినియోగం అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీల్లో నిధుల దుర్వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇకపై పంచాయతీల్లో అవకతవకలు జరగకుండా ఉండేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే పంచాయతీలో ఖర్చు చేసే ప్రతి పైసాకు పక్కాగా లెక్కలు చూపాల్సిందేనని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో సెప్టెంబరు ఒకటి నుంచి స్వర్ణ పంచాయతీ పోర్టల్‌ను అమలులోకి తీసుకురానున్నది. ఈ పోర్టల్ ద్వారానే కార్యదర్శులు నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. గ్రామాల్లో ఆస్తి, నీటి పన్నులను వందశాతం ఆన్‌లైన్‌లో చెల్లించే విధానాన్ని అమలు చేయనున్నది. దీంతో పంచాయతీల నిధుల స్వాహాకు అడ్డుకట్ట పడనున్నది. గ్రామ పాలనలో కొత్త ఒరవడికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

రూ.కోట్లలో నిధుల జమ

జిల్లాలో 722 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటికి 15వ ఆర్థిక సంఘం నిధులు, ఆస్తి, నీటి పన్ను, ఇతర లైసెన్స్‌లు, మైనింగ్, రిజిస్ట్రేషన్లు, సెస్‌ల రూపంలో ఏటా రూ. కోట్లలో నిధులు జమ అవుతున్నాయి. మేజర్ పంచాయతీల్లో కొందరు గ్రామకార్యదర్శులు, పాలకవర్గ సభ్యులు గతంలో చేతివాటం చూపారు. మోటార్లు మరమ్మతులకు గురి కాకున్నా అయినట్లు, వీధిదీపాలు వేయకనే వేసినట్లు, పారిశుధ్య పనులు చేపట్టకనే చేపట్టినట్లుగా చూపి రూ. లక్షల నిధులు స్వాహా చేశారు. ఏదైనా వస్తువును తక్కువ ధరకు కొనుగోలు చేసి, రికార్డుల్లో మాత్రం ఎక్కువ ధరకు కొనుగోలు చేసినట్లు రాసిన ఉదంతాలూ ఉన్నాయి. ఆస్తి పన్ను వసూలు చేసి సొంతానికి వాడుకున్నవారు కూడా ఉన్నారు. ఈ విషయాలు బయటపడి కార్యదర్శులు సస్పెండ్ అయిన సందర్భాలు కూడా ఉన్నాయి. మరికొందరు నిధులు సొంతానికి వాడుకుని ఆడిట్ తనిఖీల సమయంలో నగదు జమ చేశారు. ఇవన్నీ మండల పరిషత్ అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరించారు.

ఒకటి నుంచి పోర్టల్‌లో నమోదు

సెప్టెంబరు (వచ్చేనెల) ఒకటి నుంచి స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో ఆర్థిక అంశాలపై సమగ్ర వివరాలను నమోదు చేయాలి. ఈ పోర్టల్‌లో బ్లీచింగ్, వీధి దీపాలు, శానిటరీ పరికరాలు, పారిశుధ్య పనుల బిల్లులు అప్‌లోడ్ చేయాలి. అనంతరం సీఎఫ్‌ఎంఎస్ ఆమోదం తెలుపుతుంది. గ్రామ పంచాయతీల్లో అస్తి పన్ను వివరాలను కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రజలకు ఆన్‌లైన్‌లోనే డిమాండ్ నోటీసులు జారీచేయనున్నారు. పన్ను వసూళ్లను నగదు రహితంగా చేపట్టనున్నారు.

గతంలో లెక్కల్లేవు...

గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ప్రజల నుంచి ఎంత పన్ను వసూలు చేశారో...? బ్యాంకు ఖాతాలో ఎంత జమచేశారో... ? తదితర వివరాలు పంచాయతీ కార్యాలయాల్లో ఉండేవి కావు. అంతేకాక జిల్లాలోని కొంతమంది పంచాయతీ కార్యదర్శులు వసూలు అయిన పన్నుల మొత్తాన్ని తమ జేబులో వేసుకునేవారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం స్వర్ణ పంచాయితీ పోర్టల్‌ను ప్రవేశపెట్టి వీటన్నింటికీ చెక్ పెట్టనున్నది.



ఓనం ఉత్సవాల్లో ప్రసంగిస్తున్న కలెక్టర్ ఆనంద్

అలరించిన ముందస్తు ఓనం వేడుకలు

ఆకట్టుకున్న రంగవల్లులు, సంప్రదాయ నృత్యాలు

వేడుకల్లో పాల్గొనడం ఎంతో సంతోషం : కలెక్టర్

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మలయాళీల సంక్రాంతి అయిన ఓనం పండుగను ముందస్తుగా ఆదివారం నగరంలోని పురమందిరంలో నిర్వహించారు. ఈ వేడుకలను మలయాళీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి జిల్లాలోని మలయాళీ కుటుంబాలు వారు సంప్రదాయ దుస్తులు ధరించి తరలి వచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ ఓ. ఆనంద్ మాట్లాడుతూ ఉపాధి కోసం వచ్చి జిల్లాలో స్థిరపడ్డ మలయాళీలు ప్రతీఏటా జన్మభూమి కేరళలో జరిగే ఓనం పండగను ముందస్తుగా, క్రమం తప్పకుండా జరుపుకోవడం, తాను పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అందరికీ ఓనం శుభాకాంక్షలు అని తెలిపారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ నెల్లూరులో మలయాళీలు తెలుగువారితో కలిసి పోయారని తెలిపారు. రాష్ట్రం మారినా తమ సంప్రదాయాలకు విలువ నిస్తూ ముందస్తుగా ఓనంను జరుపుకోవడమే కాక, నగరవాసులకు విందు ఇవ్వడం అభినందించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో పలువురు నగర ప్రముఖులు తదితరులు పాల్గొని ఓనం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంప్రదాయ పద్ధతిలో మహిళలు ముగ్గులు వేశారు. కేరళీయుల దుస్తులతో ఓనం పాటలకు లయబద్ధంగా నృత్యాలు చేసి, అందరినీ ఆకట్టుకున్నారు.బలి చక్రవర్తిని పూజించారు. కార్యక్రమంలో మలయాళీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు టీజీ. గోపి, కార్యదర్శి మధు, ట్రెజరర్ సిద్ధిస్, చైర్మన్ మురుగన్, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు నందకుమార్, ఏపీ అధ్యక్షుడు చాచాషాన్, జాన్సన్, శ్రీకుమార్ నాయర్ తదితరులు పాల్గొని అతిథులను మెమెంటోలతో సత్కరించారు. అలాగే కళాకారులకు జ్ఞాపికలు ప్రదానం చేశారు.



నృత్యం చేస్తున్న మలయాళీ యువతులు



సంప్రదాయబద్ధంగా తీర్చిదిద్దిన రంగవల్లి

జిల్లాకు 7,10,990

స్మార్ట్ రేషన్ కార్డులు

- నేటి నుంచి పంపిణీ
- తొలిరోజు మంత్రులు, ఎమ్మెల్యేల అందజేత



ప్రభుత్వం రూపొందించిన స్మార్ట్ రేషన్ కార్డు

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ సోమవారం (నేటి) నుంచి ప్రారంభం కానున్నది. ఇందుకుగాను జిల్లాకు 7,10,990 స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చాయి. జిల్లాలోని 1,513 రేషన్ షాపుల పరిధిలో వీటి ప్రారంభం కానున్నది. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, జిల్లా స్థాయిలో మంత్రులు వీటిని పంపిణీ చేయనున్నారు. ఇందుకు తగ్గట్లు అధికారులు ఏర్పాట్లు చేశారు. కొంతమంది కొత్త కార్డుల కోసం ఎదురుచూస్తుండగా, ఇంకొందరు కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటైన తరువాత స్మార్ట్‌కార్డులను పంపిణీ చేస్తామని ప్రకటించింది. దీంతో 71,808 మంది కొత్తకార్డులు, కార్డుల్లో మార్పులు, చేర్పులు, రద్దు కోసం దరఖాస్తు చేశారు. ప్రభుత్వం వీటన్నింటినీ పరిశీలించి, ప్రకటించిన మేరకు సోమవారం నుంచి ఈ కార్డులను పంపిణీ చేయనున్నది. వీటిని తహసీల్దార్ పర్యవేక్షణలో సచివాలయ వలంటీర్లు, రేషన్ షాపు డీలర్లు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తారు. ఈనెలాఖరు వరకు ఇలా పంపిణీ చేస్తారు. అలా పంపిణీ చేయగా మిగిలిన కార్డులను సెప్టెంబరు ఒకటి నుంచి రేషన్ షాపుల్లో ఉంచుకుని డీలర్లు లబ్ధిదారులకు అందచేస్తారు. ఈ స్మార్ట్ కార్డులు ఆధునిక సాంకేతకతో రూపుదిద్దుకున్నాయి. వీటిలో బయో మెట్రిక్ డేటా, క్యూఆర్ కోడ్ వంటి ప్రత్యేకతలు ఉన్నాయి. వీటి వల్ల లబ్ధిదారులు ఎక్కడ నుంచైనా సులభంగా రేషన్ తీసుకునే అవకాశం ఉంది.

పోలీసుల అదుపులో

రౌడీషీటర్లు

- శ్రీకాంత్, అరుణ దందాలపై పోలీసుల దూకుడు
- నేడో రేపో పోలీసు కస్టడీకి కి'లేడీ'

నెల్లూరు(క్రైం) ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ శ్రీకాంత్, కి'లేడీ అరుణ దందాలపై పోలీసులు దూకుడు పెంచారు. ఇప్పటికే అరుణ కాల్‌లిస్ట్ ఆధారంగా ఆమెతో తరచూ మాట్లాడు తున్న రౌడీషీటర్లను పోలీసులు గుర్తించారు. అనంతరం వారిని అదుపులోకి తీసుకోగా, మరి కొంత మంది రౌడీ షీటర్లు పరారీలో ఉన్నారు. నెల్లూరు వేదాయపాలెం స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లు సీహెచ్ భూపతి, అరవ సురేంద్ర, కే జగదీష్‌ను పోలీసులు గంజాయి కేసులో అరెస్ట్ చేసి జైలుకు పంపారు. ఇప్పటికే జిల్లాలోని బాలాజీ నగర్ పోలీసు స్టేషన్‌తో పాటు పలు పోలీసు స్టేషన్లలో పలువురు రౌడీషీటర్లను అదుపు లోకి తీసుకున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా తిరుపతి జిల్లా పరిధిలో సైతం కొంత మంది రౌడీషీటర్లను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా కోవూరు పోలీసులు అరుణను తమ కస్టడీకి ఇవ్వాలని ఇప్పటికే కోర్టును కోరారు. ఈ క్రమంలో నేడో రేపో ఆమెను కస్టడీకి ఇవ్వనున్నారు.

దర్గామిట్ట ఎస్ఐకి పదోన్నతి

గుంటూరు రేంజ్ పరిధిలో ఆరుగురు ఎస్ఐలకు సీఐలుగా పదోన్నతి కల్పిస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన వారిలో నెల్లూరు దర్గామిట్ట ఎస్ఐ బీ రమేష్‌బాబు ఉన్నారు.

కోర్టుకెక్కిన కరేడు భూసేకరణ వ్యవహారం

- ఆలయ భూములకు నోటిఫికేషన్‌పై హైకోర్టులో రిట్
- 28న విచారణ జరిగే అవకాశం ?

కందుకూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఉలవపాడు మండలం కరేడు భూసేకరణ వ్యవహారం కోర్టుకెక్కింది. ఇండోసోల్ సోలార్ కంపెనీకి భూములు ఇచ్చేందుకు తొలినుంచి విముఖత చూపుతూ వివిధరూపాల్లో రైతులు తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో భూసేకరణ నోటిఫికేషన్‌లోని లొసుగుల ఆధారంగా హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. కరేడులో ఇండోసోల్ సోలార్ కంపెనీకోసం 4800 ఎకరాల భూసేకరణ కోసం కలెక్టరు జారీచేసిన నోటిఫికేషన్‌లో దేవదాయశాఖ భూములు కూడా ఉండటాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో రిట్‌పిటిషన్ దాఖలైంది. కరేడు గ్రామానికి చెందిన వివిధ ఆలయాల భూములతోపాటు కందుకూరు జనార్దన్‌స్వామి ఆలయం, ఉలవపాడు వేణుగోపాలస్వామి ఆలయం, సింగరాయకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయాలకు కరేడు గ్రామపంచాయతీ పరిధిలో భూములు ఉన్నాయి. ఆ భూములన్నింటినీ ఇండోసోల్ కంపెనీ కోసం సేకరించే నోటిఫికేషన్‌లో పొందుపరిచారు. అయితే దేవదాయ భూముల క్రయవిక్రయాలపై నిషేధం అమలులో ఉండటమేకాక, ప్రత్యేక పరిస్థితుల్లో ప్రజాఅవసరాలకు తీసుకోవాలంటే రాష్ట్రప్రభుత్వం నుంచి ప్రత్యేక అనుమతి పొందాల్సి ఉంది. ఈ నేపథ్యంలో భూసేకరణ నోటిఫికేషన్‌లో దేవదాయ భూములు కూడా ఉండటాన్ని సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు విచారణకు స్వీకరించింది. దీనిపై ఈనెల 28న విచారణ నిర్వహించనున్నట్లు తెలిసింది. భూసేకరణ నోటిఫికేషన్ మొత్తం లోపభూయిష్టంగా ఉందని, ఆ నోటిఫికేషన్ రద్దుకు ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్లు పేర్కొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	105
స్కిన్ చికెన్	196
స్కిన్‌లెస్	216

కోడిగుడ్ల ధర (100) : 535

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9594
వెండి కిలో ధర	రూ. 119900
వెండి ఒక గ్రాము	రూ.123.00

పోలేరమ్మకు పొంగళ్లు

బిట్రగుంట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం ముంగమూరు పంచాయతీ పేటలో వెలసి ఉన్న పోలేరమ్మ తిరునాళ్లలో భాగంగా అమ్మవారికి ఆదివారం పొంగళ్ల కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం ప్రత్యేక పూజాభిషేకాల అనంతరం సద్ది కార్యక్రమం జరిగింది. మధ్యాహ్నం అమ్మవారికి గ్రామ పొంగళ్ల నైవేద్యంగా సమర్పించారు.

న్యూస్ బాక్స్

డీఎస్సీలో జిల్లాస్థాయిలో 31వ ర్యాంకు



దండు అరుణ

లింగసముద్రం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో లింగసముద్రంకు చెందిన దండు అరుణ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 88.1 మార్కులతో 31వ ర్యాంకు సాధించింది. దీంతో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయిని పోస్టుకు ఎంపికైంది. తండ్రి బాల హజరత్‌రెడ్డి బేల్దారి మేస్త్రీగా, తల్లి బుజ్జమ్మ వ్యవసాయ కూలీ పనులు చేస్తూ తన ఇద్దరు కుమార్తెలను చదివించారు. అయితే టీటీసీ చదివిన అరుణ 2018లో డీఎస్సీలో 0.4 మార్కుల తేడాలో ఉపాధ్యాయిని పోస్టు కోల్పోయింది. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ తాను 2018 డీఎస్సీ తర్వాత 7 ఏళ్ల పాటు కష్టపడి చదివి ఈ పోస్టుకు ఎంపికైనట్టు చెప్పారు. చిన్నప్పటి నుంచి ఉపాధ్యాయిని కావాలన్నది తన ఆశయమని చెప్పారు. చిన్న పిల్లల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసి వారిని అభివృద్ధి చేయాలనేది తన లక్ష్యమని ఆమె తెలిపారు.

అనివేటి మండపం నిర్మాణానికి రూ.50వేల విరాళం



అనివేటి మండపం నిర్మాణానికి విరాళం అందజేస్తున్న భక్తులు

కందుకూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయ అనివేటి మండపం నిర్మాణం కోసం ఆదివారం భక్తులు రూ.50వేలు విరాళంగా అందజేశారు. గతంలో కందుకూరులో పంచాయతీ రాజ్ డీఈఈగా పనిచేసి గుంటూరులో నివాసం ఉంటున్న పొత్తూరి శ్రీనివాసరావు, వెంకటగౌరీప్రసన్నలు రూ. 25వేలు, వారి కుమార్తె, అల్లుడు కనకదుర్గ సాయిసింధూర, కోసూరి వెంకటసత్యరాహుల్ దంపతులు రూ. 25వేలు విరాళంగా అందజేశారు. తన మిత్రుడు మంచిరాజు వెంకటమురళీమోహన్ ద్వారా ఆలయ కమిటీసభ్యులు కొడాలి కోటేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లులకు ఈ మొత్తాన్ని అందజేశారు.

నేరాలు, ఘోరాలకు కేరాఫ్ వైసీపీ!

● ప్రతాప్‌కుమార్ రెడ్డి నేరచరిత్ర తెలిసే హత్యాయత్నం కేసు ● బీజేపీ నేత భరత్‌కుమార్



మాట్లాడుతున్న భరత్‌కుమార్

కావలి(టౌన్), ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నేరాలు, ఘోరాలకు రూట్ మ్యాప్ వేసింది వైసీపీనే అని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు గుండ్లపల్లి భరత్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం 1వ పట్టణ బీజేపీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అవినీతి అక్రమాల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రైవేట్ ఆస్తులపై అనుమతులు లేకుండా డ్రోన్లు ఎగురవేయడం తప్పు కాదని చెప్పడం సిగ్గుచేటన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి అవినీతి అక్రమాలు, దందాలు, దోపిడీలకు పాల్పడలేదా, ఆయన ఇంటిముందు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నది వాస్తవం కాదా, దళితుడు కరుణాకర్ ఆత్మహత్యకు కారణం, మరో ఇద్దరు దళిత యువకులను చిత్రహింసలకు గురిచేసింది ఆయన కాదా అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే నేర చరిత్ర తెలిసే ఎమ్మెల్యే కృష్ణారెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడ్డారని కేసు నమోదు చేశారన్నారు. మీడియాను రెండుగా చీల్చింది, ఫైలాన్‌ను కూల్చివేసింది ఎవరని ప్రశ్నించారు. కేసులకు భయపడను, అరెస్ట్ చేసుకోండి జైలుకు పోతాను అని ప్రగల్బాలు పలికారని, హత్యాయత్నం కేసు నమోదవ్వగానే కనిపించకుండా పారిపోయాడనారు. ఈ సమావేశంలో వెంకటేశ్వర్లు, మంద కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



బాబురావును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

కావలి(టౌన్), ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1978-79 పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక కృష్ణం రాజేశ్వరమ్మ కల్యాణ మండపంలో కలుసుకున్నారు. ఒక రినొకరు ఆప్యాయంగా పలకరించుకుని ఆలింగ నం చేసుకుని ఆనందడోలికల్లో తేలియాడారు. కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ పాలక మండలి సభ్యులుగా ఎంపికైన విశ్రాంత ఆర్పీఎఫ్ ఎస్ఐ పసుపులేటి బాబురావు, విశ్రాంత ఆంధ్రాబ్యాంక్ మేనేజర్ నారాయణలను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామి సేవ చేసుకునే భాగ్యం కలగడం పూర్వజన్మ సుకృతమని, ఆలయ అభివృద్ధికి తమవంతు సహకరిస్తామన్నారు. ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మధ్యాహ్నం పూర్వ విద్యార్థులు రామాయపట్నం బీచ్‌కు తరలివెళ్లి ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో నల్లూరు రమేష్, షాహుల్ హమీద్, స్వాములు, జనార్దన్, కాటా వెంకటరమణారెడ్డి, శివారెడ్డి, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం



బాధితురాలికి నగదు అందిస్తున్న బెస్ట్ వాకర్స్ సభ్యులు

కావలి(టౌన్), ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కచ్చేరిమిట్టకు చెందిన బహర్నిశ అనే మహిళ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండగా ఆమె వైద్యఖర్చులకై ఆదివారం బెస్ట్ వాకర్స్ రూ.10,000 ఆర్థిక సాయమందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు తోట శేషయ్య మాట్లాడుతూ సభ్యుల సహకారంతో మహిళ వైద్య ఖర్చులకు వితరణ చేశామన్నారు. కార్యక్రమంలో బెస్ట్ వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి మంద వెంకటేశ్వర్లు, భాస్కర్‌నాయుడు, గోపాల్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, వెంకయ్య, గౌస్‌బాషా, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీ.. వృథాగా పోతున్న నీరు!

● దిగువ గ్రామాలకు నిలిచిన తాగునీటి సరఫరా ● పట్టించుకోని అధికారులు

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు



మంగళపాలెం వెళ్లే దారిలో పైపులైన్ లీకేజీ ద్వారా వృథాగా పోతున్న నీరు

వలేటివారిపాలెం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెంలో పలు ప్రాంతాల్లో పైప్‌లైన్ లీకేజీల ద్వారా రాళ్లపాడు-రోళ్లపాడు తాగునీరు వృథాగా పోతోంది. జెండాచెట్టు వీధిలో గుండ్రాజు విజయ్ కుమార్ ఇంటి ముందు, మంగళపాలెంనకు వెళ్లే రోడ్డు పక్కన, బీసీ కాలనీ సమీపంలో ప్రధాన రహదారి పక్కన కుంభాల శ్రీనివాసులు టిఫిన్ హోటల్ ముందు పైప్‌లైన్ లీకేజీలతో నీరు వృథాగా పోతోంది. గత 20 రోజులుగా తాగునీరు వృథాగా పోతుండడంతో దిగువనున్న పోలినేనిపాలెం, రోళ్లపాడు, ఉప్పలపాడు గ్రామాలకు తాగునీరు పూర్తిస్థాయిలో సరఫరా కావడంలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బదులు పడుతున్నారు. అయినప్పటికీ పంచాయతీ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేసి తాగునీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోమవారం లైన్‌వర్క్ ఉన్నందున ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. పామూరు రోడ్డు ఫీడర్ పరిధిలోని గాయత్రీనగర్, కొత్తకుమ్మరిపాలెం, ప్రశాంతినగర్, సింహాద్రినగర్, ఎర్రవడ్డిపాలెం, పామూరుబస్టాండ్ ఏరియా, వెంకటేశ్వర నగర్‌లకు, కోవూరురోడ్డు ఉప్పుచెరువు ఫీడర్ పరిధిలోని జనార్ధనకాలనీ, దుర్గమ్మ టెంపుల్ ఏరియా, ఉప్పుచెరువు, ఏకలవ్యనగర్, బృందావనం, మాయాబజారు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలుస్తుందని వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

బీజేపీ నేత కందుకూరికి సత్కారం



కందుకూరిని సత్కరిస్తున్న వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు

కావలి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా రెండోవసారి ఎంపికైన కందుకూరి వెంకటసత్య నారాయణను వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం దేవస్థానం ప్రాంగణంలో ఘనంగా సత్కరించి అభినందించారు. ఆలయ శాశ్వత గౌరవ అధ్యక్షుడు కావడం, ఆలయ పునర్నిర్మాణంలో చేయూతను అందజేయడంతో ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రంధి రమేష్, బచ్చు వీరాస్వామి, అమరావేదగిరి సుబ్బరాయుడి గుప్త, చీదెళ్ల రామచంద్రరావు, నల్లూరు రోశయ్య, చక్కా వెంకటసత్యనారాయణ, అనుమలశెట్టి శివ, గాదంశెట్టి వేణుగోపాల్, తదతరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం పోరాడుదాం

బిట్రగుంట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం పోరాడుదామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తాళ్లూరు మాల్యాద్రి అన్నారు. బోగోలు సీపీఎం కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం 5వ మహాసభ ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పాల యానాదయ్య, తుమ్మల వెంకయ్య పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా డమ్ము భాస్కర్, కార్యదర్శిగా తుమ్మల వెంకయ్య, తదితరులను ఎన్నుకున్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ

బిట్రగుంట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలోని వాకర్స్ సభ్యులు, తైక్వాండో విద్యార్థులకు పాలకుర్తి గురవయ్య దంపతులు ఆదివారం పౌష్టికాహారం అందచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ నేత కుట్టుబోయిన బ్రహ్మానందం పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ నేతలు బీ.బర్నాడ్, అశోక్, ఎం.శ్రీనివాసులు, స్వర్ణన్‌రాజు, కె.శ్రీనివాసులు, జీవన్‌కుమార్, బీజేపీ నేత ఎస్ఎస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



ఎరువుల సమస్య అధిగమించేందుకు కృషి

● షేక్ అబ్దుల్‌రహీం, మండల వ్యవసాయాధికారి, కందుకూరు

కందుకూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఎరువుల కొరతను ముఖ్యంగా యూరియా కొరతను అధిగమించేందుకు కృషి చేస్తున్నాం. నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించటం ద్వారా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మండల వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్‌రహీం తెలిపారు.

? తీవ్రంగా ఉన్న యూరియా కొరత సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! మండలంలో యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా (లిక్విడ్)పై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇది తక్కువ శ్రమతో అధిక ఫలితం ఇస్తుంది. సాధారణ యూరియా కూడా 80 టన్నుల వరకు నిల్వలు ఉన్నాయి.

? ప్రస్తుతం కురిసిన వర్షాలతో ఏ పంటలు సాగుకు అనుకూలం. అవసరమైన విత్తనాలు సిద్ధంగా ఉన్నాయా.

! ప్రస్తుతం వర్షాధారంగా మినుము, కంది, పెసర పైర్ల సాగుకు ఎంతో అనుకూలం. కంది విత్తనాలు ఇప్పటికే రైతులకు పంపిణీ చేశాం. అలాగే రైతులు కోరితే మినుము, పెసర విత్తనాలు కూడా పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

? ఆర్ఎస్‌కేలలో ఎరువులు నిల్వలు ఎందుకు పెట్టించడం లేదు.

! ప్రస్తుతానికి వ్యవసాయ సీజన్ పూర్తిస్థాయిలో ప్రారంభంకాలేదు. రైతులు ఇండెంట్లు ఇస్తే ఉన్నతాధికారులకు తెలియజేసి ఆర్ఎస్‌కేలకు ఎరువులు తెప్పించే ప్రయత్నం చేస్తాం.

? వ్యవసాయ యాంత్రీకరణ పథకం పరిస్థితి ఏమిటి.

! ఈ పథకానికి ప్రస్తుతానికి బడ్జెట్ విడుదల కాలేదు. 80శాతం రాయితీతో డ్రోన్లు కూడా ఇస్తాం.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుడిని ఊరేగిస్తున్న భక్తులు

ఆత్మకూరు, ఆగస్టు 24 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని బట్టేపాడు గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక పొదలకూరు, బట్టేపాడు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలు ఆదివారం ముగిశాయి. శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి బట్టేపాడు, పొదలకూరు ఉత్సవ కమిటీ నిర్వాహకులు టి నర్సారెడ్డి, జి పెంచలనరసయ్య, డి వెంకటేశ్వర్లు, పెంచలరెడ్డి, ప్రసాద్, కార్తీక్, భక్తులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు



నాగారపమ్మను దర్శించుకుంటున్న భక్తులు

సంగం, ఆగస్టు 24 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న పురాతన నాగారపమ్మదేవి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్నానది జలాలు, క్షీర, సకల ద్రవ్య, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన మహిళా భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా అంకాళమ్మ తిరుణాళ్ల



అనంతసాగరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంగుంటలో ఉన్న గ్రామదేవత అంకాళమ్మ తిరునాళ్ల ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమివ్వగా మహిళలు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

మాజీ సర్పంచి శ్రీనివాసులు మృతి పార్టీకి తీరనిలోటు

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్



శ్రీనివాసులు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి, ఆగస్టు 24 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని గంగులవారి చెరువుపల్లి మాజీ సర్పంచ్ కప్పా శ్రీనివాసులు మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. శనివారం శ్రీనివాసులు గుండెపోటుతో మృతిచెందడంతో సమాచారం అందుకున్న ఆయన ఆదివారం టీడీపీ నాయకులతో కలిసి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీనివాసులు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, సొసైటీ అధ్యక్షుడు గడ్డం వెంకటసామయ్య, టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు నరసింహ, ఏడుకొండలు, అగర సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

ఘనంగా భగవాన్ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవం



ఆత్మకూరు: వెంకయ్యస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



చేజర్ల : వెంకయ్యస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఆత్మకూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేపూరు గ్రామంలో ఉన్న భగవాన్ వెంకయ్యస్వామి ఆరాధన మహో త్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. అనంతరం వెంకయ్యస్వామిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ మహోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా వెంకయ్యస్వామి ఆశ్రమంలో తన్నీరు సీతా రత్నమ్మ జ్ఞాపకార్థం ఆమె కుటుంబసభ్యులు నిర్మించిన వాటర్‌ప్లాంట్‌ను గ్రామ నాయకుడు భాస్కర్ నాయుడు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొల్లా ఆదిశేషయ్యనాయుడు, పెంచలయ్యనాయుడు, తూమాటి శేషయ్యనాయుడు, తిరుతినాయుడు, దొడ్ల సుమన్, గ్రామ సర్పంచ్ రావెళ్ల వెంకటేశ్వర్లు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

●**సంగం:** స్థానిక కొత్తూరులో ఉన్న వెంకయ్యస్వామి ఆలయంలో ఆదివారం ఆరాధన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

●**చేజర్ల:** మండలంలోని పుల్లనీళ్ళపల్లి గ్రామంలో ఆదివారం భగవాన్ వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొమ్మి లక్ష్మయ్యనాయుడి ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాలలో చేజర్ల, ఆత్మకూరు, కలువాయి, పొదలకూరు మండలాల నుంచి భక్తులు పెద్దఎత్తున పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అదేవిధంగా మండలంలోని గాలిపాళెం గ్రామంలో వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా మట్టి, గ్రావెల్ తరలిస్తే కఠిన చర్యలు : సీఐ



ఎక్స్‌కవేటర్ యజమానులకు సూచనలిస్తున్న సీఐ వెంకటరావు

ఉదయగిరి, ఆగస్టు 24 (ఆంధ్ర జ్యోతి): ఉదయగిరి సర్కిల్ పరిధిలో ఎవరైనా అనుమతుల్లేకుండా మట్టి, గ్రావెల్ తరలిస్తే వాహనాలు సీజ్ చేయడంతోపాటు శాఖాపరమైన చర్యలు తప్పవని సీఐ ఎన్ వెంకటరావు హెచ్చరించారు. ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయ ఆవరణలో సీతారామపురం, వరికుంటపాడు, ఉదయగిరి, దుత్తలూరు మండలాలకు చెందిన ఎక్స్‌కవేటర్ల యజమానులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత అధికారుల వద్ద గ్రావెల్, మట్టి తరలించేందుకు అనుమతులు తీసుకోవాలన్నారు. అనంతరం పోలీసులకు సైతం ఆ అనుమతి పత్రాల నకళ్లు అందజేయాలన్నారు. అనుమతులు పొందినా రాత్రి సమయాల్లో గ్రావెల్, మట్టి తరలించరాదన్నారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిం చిన వారిపై కేసులు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకుంటామని, వాహనాలను సైతం సీజ్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, అల శ్రీను, పోలీసులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో గణేశ్ ఉత్సవాలు జరుపుకోవాలి

ప్రశాంత వాతావణంలో వినాయకచవితి ఉత్సవాలను జరుపుకోవాలని ఉదయగిరి సీఐ ఎన్ వెంకటరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు మండలాల్లో ఉత్సవాలు నిర్వహించే వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. విగ్రహం ఏర్పాటు, నిమజ్జనం చేసే ప్రాంతాలు, నిమజ్జనానికి తరలించే తేదీ, కమిటీ సభ్యుల వివరాలను పోలీసులకు తెలియజేయాలన్నారు. ఉత్సవాల సందర్భంగా డీజేలు, పాట కచ్చేరీలకు ఎలాంటి అనుమతుల్లేవన్నారు. విగ్రహాల వద్ద విద్యుత్ ఏర్పాటు, మైక్‌సెట్ నిర్వహణకు అనుమతులు తీసుకోవడంతోపాటు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులంతా హాజరు కావాలి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గోపిశ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సాంకేతిక కారణాలతో ఇటీవల కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహణకు అంతరాయం ఏర్పడిందన్నారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేకపోవడంతో అన్ని శాఖల అధికారులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని, ప్రజలు సైతం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జేవీవీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



మోటివేటర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

అనంతసాగరం, ఆగస్టు 24 (ఆంధ్ర జ్యోతి): స్థానిక వ్యవసాయ సొసైటీ కార్యాలయం ఆవరణలో ఆదివారం రెడ్‌క్రాస్ వారి సౌజన్యంతో జేవివి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 48 యూనిట్ల రక్తం సేకరించారు. అనంతరం మోటివేటర్లకు నిర్వాహకులు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సుధాకర్, పెంచలయ్య, నియాజ్, అస్లాం, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు సత్కారం

సంగం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్‌ను ఆదివారం పడమటిపాళెం నీటిసంఘం ఉపాధ్యక్షుడు మర్రి సందీప్ శాలువాతో సత్కరించారు. ఈకార్యక్రమంలో తరుణవాయి టీడీపీ నాయకులు డేగా రామచంద్రయ్య, మర్రి ప్రసాద్, డేగా శ్రీనివాసులు, ప్రేమ్ చంద్, మొలతాటి శ్రీనివాసులు, ప్రసాద్ పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

ఉదయగిరి, ఆగస్టు 24 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని గండిపాళెం మార్గంలో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆదివారం తల్లిదండ్రులు కోరారు. గతంలో ఉదయగిరి-గండిపాళెంకు ఉదయం 8.30 గంటలకు బస్సు ఉండేదన్నారు. ఆ బస్సులో సున్నంవారిచింతల, గుడినరవ, దుంపవారిపల్లి, జీ.కొండారెడ్డిపల్లి, కొత్తపల్లి గ్రామాలకు చెందిన సుమారు 55 మంది విద్యార్థులు వెంగళరావునగర్ జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లేవారన్నారు. అలాగే ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులకు ఆ బస్సు ఎంతో అనువుగా ఉండేదన్నారు. అయితే అధికారులు ఈనెల 15 నుంచి ఆ బస్సును రద్దు చేయడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సును పునరుద్ధరించాలని, లేదంటే ఆందోళన కార్యక్రమం చేపడతామని తెలిపారు.